# విశాలభారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ 05.02.2025 | 24 క్యారెట్లు 87,554.00 | కిలో వెండి 99,678.00 | 33 °C | సంపుటి:3 | సంచిక:106

www.vishalabharati.com


# స్థానిక సంస్థల్లో బీసీలకు 42 % సీట్లు

## కాంగ్రెస్ పార్టీ నుంచి ఇస్తాం

- బీజేపీ, బీఆర్ఎస్ అలా ఇచ్చేందుకు సిద్ధమా..?
- చట్టబద్ధత రాకున్నా... రాజకీయంగా రిజర్వేషన్లు ఇస్తాం
- దేశానికే ఆదర్శంగా నిలిచేలా సమగ్ర కులగణన
- రూ.160 కోట్ల ఖర్చు.. లక్ష మందితో సర్వే చేపట్టాం
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్ సర్వేలో పాల్గొనలేదు
- సర్వేలో పాల్గొనని వారికి మైక్ ఇవ్వొద్దు
- అసెంబ్లీలో కులగణన నివేదికను ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి



"రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం నాడు అసెంబ్లీలో కులగణన నివేదికను సీఎం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీలకు రిజర్వేషన్లపై సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, బీజేపీలకు సవాల్ విసిరారు. చట్టప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం ఇవ్వాలంటే రాజ్యాంగ సవరణ జరగాలన్నారు. చట్ట ప్రకారం 42 శాతం ఇవ్వడం సాధ్యం కాకపోతే పార్టీపరంగా బీసీలకు 42 శాతం సీట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మేం సిద్ధంగా ఉన్నాం.. మీరు సిద్ధంగా ఉన్నారా అంటూ బీఆర్ఎస్, బీజేపీలను ఉద్దేశించి సీఎం రేవంత్ సవాల్ విసిరారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** బీసీలకు న్యాయం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని ముఖ్యమంత్ర రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజ్యాంగ మార్పులు అవసరమైతే.. దానికైనా కృషి చేస్తామన్నారు. అప్పటివరకు రాజకీయంగా, నైతికంగా కట్టుబడి కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించబోతోందన్నారు.

**పకడ్బందీగా కులగణన**

రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కులగణన సర్వే చేయాలని ఫిబ్రవరి 2024లో నిర్ణయం తీసుకున్నాం. కర్ణాటక, బిహార్ సహా వివిధ రాష్ట్రాల్లో జరిగిన సర్వేలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాం. సర్వే నిర్వహించే విధానాలపై వివిధ సంఘాలు, మేధావుల అభిప్రాయాలు తీసుకున్నాం. దాదాపు 50 రోజుల పాటు సర్వే జరిగింది. గ్రామాల్లో 66.39 లక్షల కుటుంబాలు, పట్టణాల్లో 45.15 లక్షల కుటుంబాల్లో సర్వే నిర్వహించాం. రాష్ట్రంలో మొత్తంగా 1.12 కోట్ల కుటుంబాల వివరాలు సర్వే చేశాం. సర్వే ప్రకారం ఎస్సీలు 61,84,319 (17.43 శాతం), బీసీలు (ముస్లిం మైనారిటీ మినహా) 1,64,09,179 (46.25 శాతం), ఎస్టీలు 37,05,929 (10.45 శాతం), ముస్లిం మైనారిటీలు 44,57,012 (12.56 శాతం) మంది ఉన్నారు. ఈ నివేదికను సంక్షేమ విధానాల తయారీకి వినియోగిస్తాం. జనగణన కంటే పకడ్బందీగా

..మిగతా 2 లో



# అమెరికా నుంచి భారతీయుల గెంటివేత

## 205 మందిని వెనక్కి పంపిన యూఎస్

- శాన్ ఆంటోనియో నుంచి బయలుదేరిన సైనిక విమానం
- అమెరికాలో చట్టవిరుద్ధంగా 7,25,000 మంది భారతీయులు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** అక్రమ వలసదారులపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అణచివేతను ముమ్మరం చేసింది. 205 మంది భారతీయ వలసదారులతో కూడిన అమెరికా సైనిక విమానం సీ-17 స్థానిక కాలమానం ప్రకారం సోమవారం శాన్ ఆంటోనియో నుంచి భారత్‌కు బయలుదేరింది. విమానం 24 గంటల తరువాత పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు చేరుకుంటుందని, వెనక్కి పంపే ముందు ప్రతి ఒక్కరినీ పరిశీలించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ విమానం ఇంధనం కోసం జర్మనీలోని రామ్‌స్టీన్‌లో ఆగనుంది. ఈ పరిణామాలను ధ్రువీకరించడానికి యూఎస్ ఎంబసీ నిరాకరించింది.

**18వేల మందితో జాబితా..**

అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) దాదాపు 18,000 మంది డాక్యుమెంట్లు లేని భారతీయ పౌరుల తొలి జాబితాను రూపొందించింది. టెక్సాస్‌లోని ఎల్‌పాసో, కాలిఫోర్నియాలోని

..మిగతా 2 లో

# నేడే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

- సర్వం సిద్ధం చేసిన ఈసీ
- గెలుపుపై కమలం ఆశాభావం
- అనూహ్యంగా పుంజుకున్న కాంగ్రెస్
- అధికారం నిలుపుకోడానికి ఆప్ అష్టకష్టాలు



**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమయింది. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అధికార ఆమ్ ఆద్మీని ఇంటికి పంపించేందుకు బీజేపీ అన్ని అస్త్రాలను సంధించింది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా మొదలు కొని ఏపీ సీఎం చంద్రబాబు వరకు అందరినీ రంగంలోకి దించింది. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన వరాలు ఆ పార్టీ అవకాశాలను మెరుగుపరిచిందన్న అభిప్రాయాలు వస్తున్నాయి. ప్రధానంగా ఆదాయ పన్ను

..మిగతా 2 లో



# మీ సర్వే కరెక్టా..? ఆధార్ వివరాలు కరెక్టా..?

- ఆధార్‌లో 3.80 కోట్లు.. కులగణనలో 3.70 కోట్లా
- ఏఐ టెక్నాలజీతో జీహెచ్ఎంసీలో సర్వే చేయాలి
- శాసనసభలో అక్బరుద్దీన్ ఓవైసీ డిమాండ్

3 లో

# ఫిబ్రవరి 4 చరిత్రలో నిలిచిపోయే రోజు

- సోషల్ జస్టిస్ డేగా జరుపుకుందాం
- నా రాజకీయ జీవితంలో ప్రత్యేకంగా గుర్తుంటుంది
- ఎస్సీ వర్గీకరణకు త్వరలోనే చట్టబద్ధత
- ఏళ్లనాటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- దేశవ్యాప్తంగా కులగణన చేయాలి
- ఎస్సీ వర్గీకరణపై శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** 'తెలంగాణ చరిత్రలో ఫిబ్రవరి 4కు అత్యంత ప్రాధాన్యం ఉంది. దశాబ్దాల నాటి ఎస్సీ వర్గీకరణకు వీలుగా తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర మంత్రిమండలి 2024 ఫిబ్రవరి 4న ఆమోదం తెలిపింది. వర్గీకరణ నివేదికను 2025 ఫిబ్రవరి 4న మంత్రిమండలి

..మిగతా 2 లో

# బీసీలకు కాంగ్రెస్ ద్రోహం చేస్తోంది



- ద్రోహాన్ని నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నాం
- నాటి మా సర్వే అధికారికమే
- 3.68 కోట్ల పౌరుల వివరాలు ఒక్కరోజులో సేకరించాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీసీలు తగ్గారు.. ఓసీలు పెరిగారు
- జీహెచ్ఎంసీలో 30 శాతం సర్వేలో పాల్గొనలేదు
- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వం బలహీన వర్గాలపై చేసిన ద్రోహాన్ని నిరసిస్తూ, బీఆర్ఎస్ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "బీసీల సంఖ్యను ఐదు శాతం తగ్గించి, బీసీల గొంతును కోసే ప్రభుత్వ కుట్రను నిరసిస్తూ ఈ వాకౌట్ చేస్తున్నాం" అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ జనాభాను తగ్గించిన తీరు బలహీన వర్గాల నుంచి తీవ్రమైన వ్యతిరేకతను ఏర్పరుస్తోంది. అసెంబ్లీలో

..మిగతా 2 లో



# సచివాలయానికి బాంబు బెదిరింపు

- ఒకరిని అదుపులోకి తీసుకున్న ఎస్పీఎఫ్
- దర్గాకు సంబంధించి సమస్యపై ప్రభుత్వానికి అర్జీ
- అధికారులు స్పందించక పోవడంతో బెదిరింపులు

2 లో



# పార్టీ మారిన ఎమ్మెల్యేలకు షాక్

- లిఖితపూర్వక సమాధానం ఇవ్వండి
- నోటీసులు జారీ చేసిన అసెంబ్లీ స్పీకర్
- సమయం కావాలన్న ఎమ్మెల్యేలు

2 లో

# ఎస్సీ వర్గీకరణకు గ్రీన్ సిగ్నల్



- నివేదికను ఆమోదించిన ఉభయ సభలు
- మూడు గ్రూపులుగా 59 కులాలు
- మాదిగలు, ఉప కులాలకు 9 శాతం రిజర్వేషన్లు
- మాలలు, ఉప కులాలకు 5 శాతం రిజర్వేషన్లు
- అత్యంత వెనుకబడిన 15 కులాలకు 1 శాతం రిజర్వేషన్లు
- ప్రభుత్వానికి జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదిక
- క్రీమీలేయర్ ప్రతిపాదన తిరస్కరించిన ప్రభుత్వం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు శాసనసభ, శాసన మండలి ఆమోదం తెలిపాయి. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నాలుగు సిఫార్సులు చేసింది. వాటిలో... రాష్ట్రంలోని మొత్తం 59 ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరించడం, ఉద్యోగాల భర్తీ విధానం, రోస్టర్ పాయింట్ల విభజన ప్రతిపాదనలను ఆమోదించిన సర్కారు... క్రీమీలేయర్ సిఫార్సును తిరస్కరించింది. మంత్రిమండలి ఆమోదించిన అనంతరం

..మిగతా 2 లో

# బీసీల జనాభా తగ్గినట్లు చూపిస్తున్నారు

## గత సమగ్ర కుటుంబ సర్వేలో కంటే కులగణనలో బీసీలు ఎలా తగ్గారు?



- తప్పులతడక సర్వేతో కుట్ర చేస్తున్నారు
- పార్టీపరంగా రిజర్వేషన్లు ఇస్తామంటున్న కాంగ్రెస్ నిబద్ధత ఏంటో అందరికీ తెలుసు
- ఓడిపోయే సీట్లు బీసీలకు కేటాయించింది
- బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేలో బీసీల జనాభా తగ్గినట్లు చూపిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. నిజానికి బీసీల్లో కుటుంబ నియంత్రణపై తక్కువ అవగాహన ఉంటుందని, అయినా జనాభా ఎలా తగ్గిందని, అంటే... బీసీలు కాపురాలు చేయడం లేదా అని ప్రశ్నించారు. తప్పులతడక సర్వేతో బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బీసీ జనాభాను తగ్గినట్లు చూపిన వారిపై చర్యలు తీసుకోరా అని ప్రశ్నించారు. మంగళవారం

..మిగతా 2 లో

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

బుధవారం,
05.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




# నేడే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

తరువాయి భాగం

మినహాయింపును రూ.12 లక్షలకు పెంచడంతో మధ్య తరగతి ప్రజలు తమకు అనుకూలంగా ఓటేసే అవకాశం ఉందని బీజేపీ భావిస్తోంది. ఆమ్ ఆద్మీ మాత్రం బడుగు, బలహీన వర్గాలపైనే ఆశలు పెట్టుకుంది. గత పదేళ్లలో ఆ వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, మరోసారి తమకే అధికారం అప్పగిస్తారని కేజ్రీవాల్ బలంగా విశ్వసిస్తున్నారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటును కూడా దక్కించుకోని కాంగ్రెస్ ఈసారి ఒకటి లేదా రెండు సీట్లను గెలిచే అవకాశం ఉందని అంచనా. అయితే, ఈ పార్టీకి ఓటు శాతం పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ కాంగ్రెస్ ఓటు శాతం పెరిగితే అది ఆమ్ ఆద్మీకి తీరని నష్టం చేసి, బీజేపీకి లాభం చేకూర్చే అవకాశం ఉంది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 699 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 13,033పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. హోమ్ ఓటింగ్ సౌకర్యంతో 7,553 మంది తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. ఈ నెల 8న ఫలితాలు రానున్నాయి.



# అమెరికా నుంచి భారతీయుల గెంటివేత

తరువాయి భాగం

శాన్‌డియాగో నుంచి 5,000 మందికి పైగా వలసదారులను బహిష్కరించాలని నిర్ణయించినట్లు పెంటగాన్ ప్రకటించింది. ప్యూ రీసెర్చ్ సెంటర్ డేటా ప్రకారం, 725,000 మంది భారతీయులు అక్రమంగా అమెరికాలో నివసిస్తున్నారు, మెక్సికో, ఎల్ సాల్వడార్ తరువాత అనధికారిక వలసదారుల జనాభాలో భారత్ మూడోస్థానంలో ఉంది. డాక్యుమెంట్లు లేని భారతీయులను చట్టబద్ధంగా తమ దేశానికి తిరిగి తీసుకురావడానికి భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని గత నెలలో న్యూఢిల్లీ తెలిపింది.
దీనికి ఏ దేశం మినహాయింపు కాదని, చట్టవిరుద్ధంగా అమెరికాలో ఉన్నవారిలో భారతీయులు ఉంటే చట్టబద్ధంగా స్వదేశానికి తీసుకు రావడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని జైశంకర్ తెలిపారు. చట్ట విరుద్ధంగా అమెరికాకు వచ్చిన భారతీయ వలసదారులను వెనక్కి రప్పించే విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ సరైనదే చేస్తారని అధ్యక్షుడు ట్రంప్ జనవరిలో ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా సైనిక విమానాలు గ్వాటెమాలా, పెరూ, హోండురాస్ దేశాలకు వలసదారులను తరలించాయి. ఇమ్మిగ్రేషన్‌పై తన ఎమర్జెన్సీ డిక్లరేషన్ లో భాగంగా ట్రంప్ గత వారం మిలటరీ బహిష్కరణ విమానాలను ప్రారంభించారు. ఇప్పటివరకు ఆరు విమానాల్లో వలసదారులను లాటిన్ అమెరికాకు విమానాల్లో పంపారు. అందులో రెండో సి -17 కార్గో విమానాల ల్యాండింగ్‌కు కొలంబియా నిరాకరించింది. దీంతో నాలుగు మాత్రమే గ్వాటెమాలాలో ల్యాండ్ అయ్యాయి.

# బీసీలకు కాంగ్రెస్ ద్రోహం చేస్తోంది



తరువాయి భాగం

ఈ అంశంపై వారు తమ అభిప్రాయాలను, బాధను వ్యక్తం చేయాలని ప్రయత్నించినా, ప్రభుత్వం వారికి అవకాశాన్ని ఇవ్వలేదని కేటీఆర్ ఆరోపించారు. బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పిదాలపై, దాని వృద్ధిని అడ్డుకునే చర్యలను నిరసిస్తూ శాసనసభ నుంచి వాకౌట్ చేస్తున్నామని BRS పేర్కొంది. కేటీఆర్, ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం చేసిన ప్రకటనకు పూర్తి మద్దతు వ్యక్తం చేశారు. "మా ప్రభుత్వం వర్గీకరణ కోసం చేస్తున్న ప్రతి ప్రయత్నాన్ని మేము మద్దతు ఇస్తాము" అని తెలిపారు.
అంతకు ముందు సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. తాము అధికారంలో ఉన్నప్పుడు నిర్వహించిన 'సమగ్ర కుటుంబ సర్వే' అధికారికమేనని స్పష్టం చేశారు. ఆ సర్వేలో 1.03 కోట్ల కుటుంబాలకు చెందిన 3.68 కోట్ల పౌరుల వివరాలను ఒక్కరోజులోనే సేకరించామని గుర్తుచేశారు. గత సర్వే నివేదిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని వివరించారు. రేవంత్ సర్కారు చేపట్టిన కులగణనను అనేకమంది బహిష్కరించారని, నివేదిక తప్పుల తడక అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీనే చెప్పారని గుర్తుచేశారు. ''నిజానికి ఈ రోజు సభను నిర్వహిస్తే.. బీసీలకు 42% చట్టబద్ధ కోటాకు ప్రత్యేక బిల్లు పెడతారని ఆశించాను'' అని వ్యాఖ్యానించారు. గతంలో తాము నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 57 రకాల వివరాలను ఎందుకివ్వాలని, సర్వేను బహిష్కరించాలని అప్పట్లో రేవంత్‌రెడ్డి చెప్పలేదా? అని నిలదీశారు. బీసీల ఆవేదనపై మాట్లాడుదామంటే.. చర్చించే అవకాశం లేకుండా పోయిందని, బయట బీసీలు గగ్గోలు పెడుతున్నారని, బీసీ సంఘాలు, కాంగ్రెస్ ఎమ్మెల్సీలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారని కేటీఆర్ వివరించారు.
బీసీలు తగ్గారు.. ఓసీలు పెరిగారు: తలసాని
బీసీలకు 42% రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాకే.. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీలో కులగణనపై సీఎం రేవంత్ ప్రకటన తర్వాత తలసాని మాట్లాడారు. కులగణన సర్వేలో లోపాలున్నాయని, మళ్లీ సర్వే చేయాలని సూచించారు. సర్వేలో 57 అంశాలను పొందుపర్చడం వల్ల చాలా మంది వివరాలు చెప్పలేదని, జీహెచ్ఎంసీ పరిధిలో 30% మంది మాత్రమే సర్వేలో పాల్గొన్నారనే సమాచారం తనకుందన్నారు. కులగణన సర్వేలో బీసీలు, ఎస్సీలు, ముస్లింలు తగ్గినట్లుగా.. ఓసీలు పెరిగినట్లు చూపించారనే చర్చ జరుగుతోందన్నారు.

# ఎస్సీ వర్గీకరణకు గ్రీన్ సిగ్నల్

తరువాయి భాగం

సంబంధిత నివేదికను మంగళవారం శాసనసభ, శాసనమండలిలో ప్రవేశపెట్టింది. రెండుచోట్లా నివేదికకు ఆమోదం లభించింది. దీంతో దాదాపు మూడు దశాబ్దాలుగా వర్గీకరణ కోసం ఎదురుచూస్తున్న వారికి లబ్ధి చేకూరనుంది.జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్.... సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో ప్రాతినిధ్యం ఆధారంగా అత్యంత వెనుకబడిన కులాలను గ్రూప్1లో, మధ్యస్థ లబ్ధిపొందిన కులాలను గ్రూప్2లో, మెరుగైన ప్రయోజనాలు పొందిన కులాలను గ్రూప్3లో చేర్చింది. 2011 జనాభా గణాంకాల ప్రాతిపదికన... ఎస్సీ జనాభాలో 61.967% మంది ఉన్న మాదిగ కులంతోసహా 18 కులాలను గ్రూప్2 కింద చేర్చి 9% రిజర్వేషన్లను ప్రతిపాదించింది. 29.26% మంది ఉన్న మాల, మాలఅయ్యవార్ కులంతోసహా 26 కులాలను గ్రూప్3లో చేర్చి 5% రిజర్వేషన్లను, ఇక 3.28% మంది ఉన్న 15 కులాలను గ్రూప్1లో చేర్చి ఒక శాతం రిజర్వేషన్లను ప్రతిపాదించింది. కులంతోసహా 26 కులాలను గ్రూప్3లో చేర్చి 5% రిజర్వేషన్లను, ఇక 3.28% మంది ఉన్న 15 కులాలను గ్రూప్1లో చేర్చి ఒక శాతం రిజర్వేషన్లను ప్రతిపాదించింది.
సుప్రీంకోర్టు తీర్పును అధ్యయనం చేసి జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ ప్రభుత్వానికి నాలుగు సిఫార్సులు చేసింది. ఇందులో మొదటి సిఫార్సుగా... ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరించాలంది. రెండోదిగా... ఉద్యోగాల భర్తీ సమయంలో ఖాళీగా మిగిలిన పోస్టులకు తదుపరి ప్రకటనకు క్యారీఫార్వర్డ్ చేయాలని సూచించింది. మూడోదిగా... ఎస్సీ కులాలకు రోస్టర్ పాయింట్ల ఖరారును ప్రతిపాదించింది. నాల్గోదిగా... ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్‌ను ప్రవేశపెట్టాలంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీచైర్మన్లు, మేయర్లు తదితర ప్రజాప్రతినిధులతోపాటు గ్రూప్1 సర్వీసులో ఉన్న వారిని క్రీమీలేయర్‌గా పరిగణించాలని ప్రతిపాదించింది. ఈ వ్యక్తుల రెండోతరం రిజర్వేషన్ల ప్రయోజనాన్ని పొందకుండా మినహాయించేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. తొలి మూడింటిని ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వం... నాలుగో సిఫార్సుగా ఉన్న క్రీమీలేయర్ ప్రతిపాదనను తిరస్కరించింది.

# స్థానిక సంస్థల్లో బీసీలకు 42 % సీట్లు



తరువాయి భాగం

కులగణన చేశాం. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటించాం. ఒక ఎన్యుమరేటర్ రోజుకు 10 ఇళ్లకంటే ఎక్కువ ఇళ్లలో సర్వే చేయలేదు. 8 పేజీలతో ఉన్న ప్రశ్నపత్రంలో సమగ్ర వివరాలు నమోదు చేశాం. 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజుల పాటు పనిచేసి డేటా క్రోడీకరించారు. మొత్తంగా రూ. 125 కోట్లు ఖర్చు చేసి సర్వే ద్వారా సమగ్ర వివరాలు సేకరించాం. మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సర్వే చేయించాం'' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కులగణన సర్వే సమాచారాన్ని.. రాష్ట్రంలో సంక్షేమ పథకాల విధానాల కోసం ఉపయోగిస్తామని సీఎం స్పష్టం చేశారు.

**కేసీఆర్ కుటుంబం సర్వేలో పాల్గొనలేదు..**

కులగణన సర్వేలో పాల్గొనని శాసన సభ్యులకు దీనిపై చర్చలో మాట్లాడే అర్హత లేదని.. సర్వేలో పాల్గొన్న వారికే మైక్ ఇవ్వాలని, సర్వేలో పాల్గొనని సభ్యులకు మైక్ ఇవ్వవద్దని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, పద్మారావు, డీకే అరుణ వంటి వారు సర్వేలో పాల్గొనలేదన్నారు. సర్వే ప్రశ్నపత్రంలో 5వ పేజీలో భూముల వివరాలు చెప్పాల్సి వస్తుందని భయపడి సర్వేకు కేసీఆర్ కుటుంబం దూరంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇప్పటికైన వారంతా సర్వేలో వివరాలు అందించాలని కోరారు. సర్వేలో అడిగిన ప్రశ్నలతోనే కొంత మంది సర్వేకు దూరంగా ఉన్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా చెప్పారని చురకలేశారు.

**బీఆర్ఎస్ సర్వే తప్పుల తడక..**

గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొలిసారి.. రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసిన రేవంత్.. దాని నివేదికను ఎందుకు బయట పెట్టలేదని ప్రశ్నించారు. అది తప్పుల తడక అన్నారు. కుటుంబ సర్వే నివేదికను ప్రజల ముందు, సభముందు పెట్టకుండా లిమ్కా బుక్ రికార్డుకు అందించిన ఘనులని విమర్శించారు. ఎంతకాలం ప్రజలను బీఆర్ఎస్ మోసం చేస్తుందని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మేం బీసీలకు రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో కులగణన ప్రక్రియను నిర్వహించామని స్పష్టం చేశారు. కులగణన నివేదికలో నాల్గవ విభాగంలో ప్రైవసీ వివరాలు ఉన్నందునా మేం నివేదిక బయట పెట్టలేమన్నారు. ఆ వివరాలు కాకుండా ఏ వివరాలు అడిగినా సభ్యులకు అందిస్తామన్నారు. 1.12శాతం మాత్రమే జనాభా వృద్ధి రేటు ఉందని అందుకే జనాభా పెరుగుదల తక్కువగా కనిపిస్తుందని. అలాగే సర్వేలో పాల్గొనని వారి లెక్కలు కూడా రాలేదని గుర్తు చేశారు. కులగణన సర్వేలో బీసీలు, మైనార్టీల జనాభా శాతం పెరిగిందని స్పష్టం చేశారు.

**జనగణన ఏదీ..?**

1931 నుంచి ప్రతి 10 ఏళ్లకు ఒకసారి దేశంలో జనగణన చేపట్టారని.. కానీ 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఇప్పటివరకు దేశంలో జనాభా లెక్కలు నిర్వహించలేదని మండిపడ్డారు. 2021లో దేశంలో జనగణన చేపట్టాల్సి ఉన్నా.. ఇన్నేళ్లుగా మోదీ సర్కార్ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు గుప్పించారు. బలహీనవర్గాలకు హక్కులు ఇవ్వడం బీజేపీకి ఇష్టం లేదని.. వారికి ఏదైనా సాయం చేయాలనుకుంటే 2021లో లెక్కించాల్సిన జనాభాను ఇంత వరకు ప్రధాని మోదీ ఎందుకు చేయలేదని అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

# ఫిబ్రవరి 4 చరిత్రలో నిలిచిపోయే రోజు

తరువాయి భాగం

ఆమోదించింది. దశాబ్దాలుగా నలుగుతున్న జఠిల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది ఈ రోజే. అందువల్ల ఈ రోజును సామాజిక న్యాయ దినోత్సవంగా గుర్తుపెట్టుకోవాల్సిన అవస రం ఉంది' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఎస్సీల వర్గీకరణ నివేదికపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. వర్గీకరణ అమలుకు త్వరలోనే చట్టం తేవటం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా చూస్తామని చెప్పారు. ఎస్సీల రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానాన్ని తిరస్కరించటం ద్వారా భవిష్యత్తులో సమస్య రాకుండా చేసుకున్నామన్నారు.
ఎస్సీ వర్గీకరణ అమలుచేసే బాధ్యతను తమ కేబినెట్ తీసుకుంటుందని రేవంత్ చెప్పారు. వర్గీకరణ నివేదికపై ప్రక టన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఉమ్మడి ఏపీలో సీఎంలుగా ఉన్న 16 మందికి, తెలంగాణ ఏర్పడ్డాక సీఎంగా ఉన్న వారికి రాని అవకాశం నాకు వచ్చింది. ఈ సంతోషం చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది..' అని పేర్కొన్నారు. గతంలో ఇదే అసెంబ్లీలో ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు వాయిదా తీర్మానం ఇస్తే తనను, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, సంపత్‌కుమార్‌లను సభ నుంచి బహిష్కరించారని గుర్తుచేశారు. ఇప్పుడు ఇదే అసెంబ్లీలో సభా నాయకుడిగా వర్గీకరణ అమలుకు నిర్ణయం తీసుకుంటున్నామని చెప్పారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలపై చర్చలో పాల్గొని మద్దతు తెలిపినందుకు కేటీఆర్, అక్బరుద్దీన్, కూనంనేని సాంబశివరావు, పాయల్ శంకర్ సహా ఇతర సభ్యులకు ప్రభుత్వం, సామాజికవర్గాల తరఫున కృతజ్ఞతలు. సభ్యులంతా విజ్ఞత ప్రదర్శించి సంక్లిష్టమైన సమస్యకు పరిష్కారం చూపారని సీఎం రేవంత్ అన్నారు. ఇంతకాలం వర్గీకరణ కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన అమరులకు నివాళులు అర్పిస్తున్నా. వారి మరణం వృథా పోదు. కులగణన, ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో ఇకపై ఎవరూ త్యాగాలు చేయాల్సిన అవసరం లేదు. రాష్ట్రంలో కులగణనను అమలు చేశాం. దేశంలో రాబోయే జనగణన సమయంలో కులగణన చేయాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు.

# బీసీల జనాభా తగ్గినట్లు చూపిస్తున్నారు

తరువాయి భాగం

కులగణనపై అసెంబ్లీలో జరిగిన చర్చలో శంకర్ మాట్లాడారు. 'సమగ్ర కుటుంబ సర్వేలో తేలిన బీసీ కులాల శాతం కంటే ఈ కులగణనలో శాతం ఎందుకు తగ్గింది? సమగ్ర కుటుంబ సర్వే ఎక్కడుందని సీఎం అడుగుతున్నారు? అది మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ వెబ్‌సైట్‌లోనే ఉందని, ఆ సంస్థ ప్రైవేటుదేమీ కాద'ని చెప్పారు. కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ చేసేప్పుడు చట్ట సవరణ కావాలని కాంగ్రెస్ పార్టీకి తెలియదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామన్నారని, సీఎం కాక ముందు రేవంత్ రెడ్డికి చట్టాలపై అవగాహన లేదా అని అడిగారు. పార్టీపరంగా బీసీలకు 42 శాతం ఇస్తామని రేవంత్ అంటున్నారని, కానీ కాంగ్రెస్ నిబద్ధత ఏమిటో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయే సీట్లు బీసీలకు ఇచ్చారని ఆరోపించారు. మొత్తం 119 స్థానాల్లో 27 స్థానాలు బీసీలకు ఇచ్చామని చెప్పారని, కానీ అందులో 5 సీట్లు పాత బస్తీలోవేనని పేర్కొన్నారు. ఆ 5 సీట్లలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నిలబడినా గెలవరని అన్నారు. సమాజంలో ఉన్న చిట్టచివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ ఫలాలు అందాలన్నదే బీజేపీ ఆలోచన అని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు.



# సచివాలయానికి బాంబు బెదిరింపు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయాన్ని పేల్చివేస్తానని బెదిరింపు కాల్స్ వచ్చాయి. దీంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. మూడు రోజుల లంగర్ హౌజ్‌కు చెందిన సయ్యద్ మీర్ మహ్మద్ అలీ నుంచి ఫోన్ చేస్తున్నట్టు గుర్తించారు. అతను దర్గాకు సంబంధించి ఓ సమస్యపై ప్రభుత్వానికి తాను అర్జీ పెట్టుకున్నాడు. అధికారులు స్పందించక పోవడంతో బెదిరింపులకు పాల్పడ్డట్టు తెలుస్తోంది. ఫోన్ చేసిన సయ్యద్ మీర్ మహ్మద్ అలీని అదుపులో తీసుకొని ఎస్పీఎఫ్ పోలీసులు విచారించారు. ఈ సమయంలో పోలీసులు, సెక్రటేరియట్ అధికారులతో అతను వాగ్వాదానికి దిగాడు. అటు సచివాలయంలో ఎలాంటి బాంబు లేదని పోలీసులు తేల్చారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే.. అతను ఎందుకు ఫోన్ చేశాడన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు సైఫాబాద్ పోలీసులు.
2024 అక్టోబర్ వరకు సచివాలయం భద్రత బాధ్యతలను.. తెలంగాణ స్పెషల్ పోలీస్ చూసింది. ఆ తర్వాత తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు అప్పగించింది. కమాండెంట్ దేవీదాస్ సచివాలయ ప్రధాన భద్రతాధికారిగా నియమితులయ్యారు. ఆయన నేతృత్వంలో 212 మంది సిబ్బంది భద్రతా విధుల్లో ఉంటారు. వీరే కాకుండా.. హైదరాబాద్ కమిషనరేట్ పోలీసులు శాంతి భద్రతలు, ట్రాఫిక్, ఆక్టోపస్ క్విక్ రియాక్షన్ టీమ్ విధుల్లో ఉంటాయి.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలకు షాక్

- లిఖితపూర్వక సమాధానం ఇవ్వండి
- నోటీసులు జారీ చేసిన అసెంబ్లీ స్పీకర్
- సమయం కావాలన్న ఎమ్మెల్యేలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఫిరాయింపు ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి 2025, ఫిబ్రవరి 4న నోటీసులు జారీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసిన అసెంబ్లీ సెక్రటరీ.. పార్టీ మార్పు వ్యవహారంపై లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. స్పీకర్ కార్యాలయం నుంచి నోటీసులు అందుకున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలు.. వివరణ ఇవ్వడానికి సమయం కావాలని కోరారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలైన విషయం తెలిసిందే. దీంతో కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్



పార్టీలో చేరారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై బీఆర్ఎస్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టులో అనుకూలంగా తీర్పు రాకపోవడంతో బీఆర్ఎస్ సుప్రీంకోర్టు మెట్లు ఎక్కింది. ఈ మేరకు బీఆర్ఎస్ పిటిషన్ పై విచారణ చేపట్టిన దేశ అత్యున్నత న్యాయస్థానం.. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేయాలని స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో తెలంగాణ అసెంబ్లీ సెక్రటరీ.. మంగళవారం (ఫిబ్రవరి 4) ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
05.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




# డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

▸ **కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**
హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి డివిజన్లోని సూర్య కాలనీలో జరుగుతున్న సిసి రోడ్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సూర్య నగర్ కాలనీ ప్రధాన రోడ్డు మార్గం నిర్మాణం వల్ల కేవలం సూర్య నగర్ కాలనీ వాసులకు మాత్రమే కాకుండా పరిసరాల్లో ఉన్నటువంటి పద్మాలయ కాలనీ,పరమేశ్వర కాలనీ,గాయత్రి నగర్ కాలనీ,బ్లడ్ బ్యాంక్ కాలనీ,సూర్య నగర్ కాలనీ పేస్ 1,సూర్య నగర్ కాలనీ పేస్ 2, సూర్య నగర్ కాలనీ పేస్ 3 అలాగే వివిధ కాలనీవాసులకు రోడ్ సమస్య నుండి విముక్తి లభిస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో హయత్ నగర్ డివిజన్ ను మరింత అభివృద్ధి పరిచేలా కృషి చేస్తానని అన్నారు. ఈ పరిశీలనలో డి ఇ దామోదర్ , ఏ ఇ హేము నాయక్ , బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ , బిజెపి డివిజన్ అధ్యక్షులు గంగాని శీను ,జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు పారంద మహేష్ , నాయకులు శ్రీకాంత్ , మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మీ సర్వే కరెక్టా..? ఆధార్ వివరాలు కరెక్టా..?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
కులగణనపై తెలంగాణ అసెంబ్లీలో వాడివేడీగా చర్చ జరిగింది. ఆధార్ 2023 రిపోర్ట్ ప్రకారం తెలంగాణ జనాభా 3.80 కోట్లని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన ఓవైసీ అన్నారు. కులగణన సర్వే కరెక్టా? ఆధార్ వివరాలు కరెక్టా? అని ప్రశ్నించారు. సర్వే రిపోర్ట్ కరెక్ట్ అయితే ఆధార్ వివరాలు తప్పని తీర్మానం చేద్దామన్నారు. ఓటర్ లిస్ట్ తప్పయితే ఆధార్ కూడా తప్పేనా?.. రాష్ట్ర వ్యాప్తంగా ఫేక్ ఆధార్ కార్డులు ఎన్ని ఉన్నాయో లెక్కలు తేలుద్దామన్నారు.. రాష్ట్రంలో ఇవాళ్టి వరకు 90 లక్షల 10 వేల రేషన్ కార్డులున్నాయని తెలిపారు అక్బరుద్దీన్ ఓవైసీ. ఓటర్ లిస్ట్ కు సర్వే లెక్కలకు చాలా తేడా ఉంది. నాంపల్లిలో ఫేక్ ఓట్లు చాలా ఉన్నాయి. డబుల్ డబుల్ ఓట్లు ఉన్నాయి. ఏఐ టెక్నాలజీతో జీహెచ్ఎంసీలో సర్వే చేయాలి. 2011 లెక్కల ప్రకారం 51 లక్షల మంది మైనార్టీలు ఉన్నారు. ఆధార్ 2023 రిపోర్ట్ ప్రకారం తెలంగాణలో 3 కోట్ల 80 లక్షల మంది జనాభా ఉన్నారు. నేను ఒక్క ముస్లింలకే కాదు అన్ని వర్గాలకు ప్రతినిధిని.ముస్లింలకు ఇపుడున్న 4 శాతం రిజర్వేషన్లు మతపరమైనవి కావు. ఈ డబ్ల్యూసీ రిజర్వేషన్లు 25 శాతం పెంచాలి. అన్ని వర్గాలు ఓట్లేస్తేనే గెలిచారు. ముస్లిం మైనారిటీలు కూడా వెనుకబడిన వాళ్లే. ఏ కులమైనా మనమందరం భారతీయులం. పేదరికం తగ్గాలంటే అన్ని వర్గాలకు అవకాశం ఇవ్వాలన్నారు.

# శ్రీ భూనీలా సామెత శ్రీ వెంకటేశ్వర స్వామి 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు

▸ **ఫిబ్రవరి 9 నుండి 11 వరకు బ్రహ్మోత్సవాలు**

**పెద్ద అంబర్పేట్,విశాలభారతి:**
పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ లోని కుత్బుల్లాపూర్ గ్రామంలో శ్రీ భూనీలా సామెత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 14వ వార్షిక బ్రహ్మోత్సవకు ఆహ్వానిస్తూ పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డిని కలిసిన ఆలయ కమిటీ చైర్మన్ కొండ్ర ఎల్లమయ్య కురుమ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ.... శ్రీ భూనీల సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 9 నుండి 11 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని,



ఫిబ్రవరి 11 ఉదయం 10 గంటలకు జరుగు కళ్యాణ మహోత్సవానికి గ్రామ ప్రజలు ముఖ్య అతిథులు రాజకీయ ప్రముఖులకు రానున్నారని తెలిపారు. అదే విధంగా ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా ఈ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహణ జరుగుతుందని ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని తెలియజేశారు, నిత్య అన్నదాన పోషకులు బద్దుల సురేఖ కృష్ణ యాదవ్ అలాగే ప్రతి సంవత్సరం కళ్యాణం రోజు అన్నదానం చేయించేవారు శివన్న గారి రాజేష్ గౌడ్, గాదె ప్రవీణ్ గుప్తా, బైరవని కాశీనాథ్ గౌడ్, సురుగురి శ్రీకాంత్ రెడ్డి, పటేల్ శ్రీనివాస్, బైరగౌని రాజు గౌడ్ల సహకారంతో నిత్య అన్నదాన కార్యక్రమంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు,ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత బండారి రమేష్, గ్రామ మాజీ ఎంపిటిసి భీమగౌని భాస్కర్ గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ ముద్దం స్వరూప వీరస్వామి యాదవ్, ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధనం రఘునంధం చౌర్యులు, ఆలయ ధర్మకర్తలు భీమగౌని దేవేందర్ గౌడ్, సురుగూరి శ్రీకాంత్ రెడ్డి, బైరగోని లావణ్య కాశీనాథ్ గౌడ్, మబ్బు కృష్ణ, బద్దుల కృష్ణ యాదవ్, గాదె శ్రీనివాస్ గుప్తా, రంగ రౌతు శ్రీనివాస్, దుర్గం రాజు యాదవ్, పుల్లగొని అరుణ్ గౌడ్, అలువాల భారతి రమేష్, నాయిని ప్రణయ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



INTERVIEW

# రాజకీయాల కంటే గ్రామాభివృద్ధికే పెద్దపీట

## కుటిల రాజకీయాల నడుమ తామరాకులా చామ కుటుంబం

## ప్రజాసేవకు అంకితమైన చామ సంపూర్ణ-విజయాశేఖర్ రెడ్డి

## పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలో మచ్చలేని పొలిటికల్ ఫ్యామిలీ

*“ కుటిల రాజకీయాలతో ఆ కుటుంబానికి దక్కిన పదవులు తక్కువే. కానీ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఆ కుటుంబానికంటూ ఓ ప్రత్యేక గుర్తింపు. అలా అని కుటుంబానిదంతా సమాంతర రాజకీయ వ్యవస్థ అనుకుంటే పొరపాటే. పదవులతో సంబంధం లేకుండా, ప్రజా సేవ చేయడమే ఆ కుటుంబం పేరును చిరస్మరణీయం చేసింది. రాజకీయమనే వైకుంఠ పాళిలో కాటు వేసే కాలసర్పాల నడుమ సుమారు ఐదు పుష్కరాలుగా ప్రజల శ్రేయస్సు, గ్రామాభివృద్ధియే ప్రధాన అజెండాగా రాజకీయాల్లో ఆ కుటుంబ సభ్యులు కొనసాగుతున్నారు. ప్రస్తుతం రాజకీయం అంటేనే కాసులు కుమ్మరించి పదవులు దక్కించుకోవాలి, పదవుల్లో చేరి ఖజానా నింపుకోవాలి, కబ్జాలు చేసి, పేదలను పీడించుకోవాలనే కుహానా విధానాలకు ఆ కుటుంబం అంటే అస్సలు గిట్టదు. ఇక పేదల పక్షాన నిలబడే ఆ కుటుంబ సభ్యుల పేర్లు చెబితే... అగ్గి మీద గుగ్గిలమయ్యే ఎంతో మంది రాజకీయ లీడర్ల ఒత్తిళ్లను పొత్తిళ్లపై మోస్తూనే ఉన్నారు. అలా పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీతోపాటు, జిల్లా రాజకీయాల్లోనే తమకంటే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కుటుంబం నుంచి వచ్చి, నిఖార్సైనా ప్రజా నాయకులుగా నిలబడిన చామ సంపూర్ణ-విజయాశేఖర్ రెడ్డి గురించి ఈ ప్రత్యేక కథనంలో తెలుసుకుందాం.*

**విశాలభారతి, హైదరాబాద్ :**
ఊరి రాజకీయాలు రాజ్యమేలుతున్న రోజుల్లో... కుంట్లూరు గ్రామం నుంచి రాజకీయాల్లో చురుగ్గా కొనసాగుతున్నది చామ ప్రతాపరెడ్డి కుటుంబం. సరోజినీపుల్లారెడ్డి ప్రధాన అనుచరుల్లో ఒకరిగా.. ప్రతాపరెడ్డి పదవులను ఆశించకుండా, కేవలం ప్రజలకు సేవలు అందితే చాలనుకునే సాదాసీదా ప్రజల మనిషి. అందరూ ఆయన్ను, ఆ కుటుంబాన్ని మొదటి నుంచి అదేవిధంగానే చూశారు. కేవలం తమ రాజకీయ అవసరాల కోసమే, తమ వెంట తిప్పుకున్నారు. రాజకీయంగా ఒక్క మెట్టు పైకి ఎదిగి పదవులు దక్కించుకున్న తర్వాత... వీరిని దారిదాపుల్లోకి కూడా రానివ్వని జాబితాలో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతోమంది బడా నేతలు ఉంటారు. కానీ ప్రజలకు సేవ చేయాలనే ఆ సంకల్పంతో, పదవులు ఆశించని స్వచ్ఛమైన వారి ఎదుట కుటిల రాజకీయాలు నిలవలేకపోయాయి. అలా 1965లో మొదలైన చామ కుటుంబ రాజకీయ ప్రస్థానాన్ని... గ్రామం, మున్సిపాలిటీగా మారిన ఆ జనాలు ఆదరిస్తూనే ఉన్నారు. అలా గ్రామ సర్పంచులుగా, సింగిల్ విండో చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ వరకు అతి తక్కువ పదవులే దక్కినా... జనాలు మాత్రం వీరి వెంటే ఉన్నారు. దీంతో స్ట్రయిట్ ఫార్వార్డ్ రాజకీయాలతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే ఆ కుటుంబానికొక ప్రత్యేక గుర్తింపు ఉంది.

### చామ ముందు నిలవలేని రాజకీయ ప్రత్యర్థులు...

నిస్వార్థంగా ప్రజల పక్షాన నిలిచే చామ కుటుంబ సభ్యుల ముందు ఏ ఒక్క రాజకీయ ప్రత్యర్థి కూడా నిలవలేకపోయారు. నాటి తరం నుంచి రెండో తరం వరకు చామ కుటుంబ సభ్యులకు పదవులు దక్కకుండా చేశారే తప్పా... ప్రధాన ఎన్నికల్లో తమ గెలుపు కోసం, పార్టీ కోసం పనిచేసిన ఆ కుటుంబాన్ని కేవలం వారి రాజకీయ అవసరాలకు వాడుకుని, పదవులు కట్టబెట్టి అందలం ఎక్కించలేదు. ఆ జాబితాలో ఎంతో మంది ఎమ్మెల్యేలూ, మంత్రులు, ఎంపీలు కూడా ఉన్నారు. అలాంటి రాజకీయ కుట్రలకు ఓవైపు బలైన... ప్రజల పక్షాన నిలుస్తూ, గ్రామాభివృద్ధికి కట్టుబడి రాజకీయాల్లో కొనసాగుతున్న చామ సంపూర్ణవిజయాశేఖర్ రెడ్డి ముందు ప్రత్యర్థులు నిలవలేకపోతున్నారు.

### కాటు వేసిన కాలసర్పాలే ఎక్కువ...

నిజానికి చామ కుటుంబం నుంచి ప్రతాప రెడ్డి మొదలుకుంటే ఇప్పుడన్న చామ రామ్ రెడ్డి, చామ కృష్ణారెడ్డి, చామ విజయశేఖర్ రెడ్డితో వ్యాపారవేత్తగా ఎదిగిన మరో సోదరుడి వరకు తమతమ రంగాల్లో స్వశక్తితో ఎదిగినవారే. కేవలం తమకున్న చరిస్మాతో, నిస్వార్థమైన రాజకీయాలకు వన్నె తీసుకువస్తున్నా... ఏనాడూ స్వప్రయోజనాల కోసం జనాలను, గ్రామాన్ని బలిపీఠం ఎక్కించలేదు. కేవలం తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఎంతవరకైనా నిలబడే చామ కుటుంబం అంటే నేటి కుటిల రాజకీయాలతో పబ్బం గడిపే నేతలకు కళ్ల మంట అని చెప్పాలి. కానీ ప్రజల పక్షాన నిలిచి, ప్రజల కోసం పనిచేస్తూ, గ్రామ ప్రయోజనాల తర్వాతే, తమ రాజకీయ పదవులు అనే వారి విధానంతో రాజకీయాల్లో తమకు ఆశించిన స్థాయిలో పదవులు దక్కకుండా చేసిన ఏనాడూ బాధపడలేదు. అయినా నిలబడుతూ హయత్ నగర్ మండల పరిధిలోని కుంట్లూరు, ఆ పక్కనే ఉండే పశుమాముల, కల్వంచ, ఇప్పుడున్న పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ వరకు ఆ కుటుంబం చెప్పింది ఇప్పటికీ శాసనం లాంటిదే. విశ్వసనీయమైన రాజకీయాలతో, పదవులు ముఖ్యం కాదు, ప్రజాసేవకు అంకితమైన ఆ కటుంబంలోని నుంచి మొదటిసారి ఓ మహిళ మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ పదవీని సంపూర్ణవిజయశేఖర్ రెడ్డి దక్కించుకున్నది. చామ కుటుంబ రాజకీయ వారసురాలిగా, విజయశేఖర్ రెడ్డి సతీమణిగా మొదలైన రాజకీయ ప్రస్థానం నిత్యం జనం పక్షాన నిలిచే నాయకురాలిని చేసింది. అధికారంలో ఉన్న పార్టీదే హవా ఉంటుంది. అలా గెలిచిన నాయకులకే అవసరమైన నిధులు ఇచ్చే ఆనవాయితీ కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన ఆ కుటుంబం ఇప్పటికీ ఆ పార్టీలోనే ఉన్నా... పార్టీ విధానాలను తూచ తప్పకుండా, గ్రామ ప్రయోజనాలకు ఇప్పటికి కట్టుబడి రాజకీయాలను శాసిస్తున్నారు. వైవిధ్యమైన రాజకీయ విధానాలతో ప్రత్యర్థులకు కూడా గ్రామాల్లో, కౌన్సిల్ నిధులు కేటాయించాలనే వినూత్న సంప్రదాయానికి ఆ కుటుంబం నుంచి వచ్చిన చామ సంపూర్ణవిజయ శేఖర్ రెడ్డి పురుడు పోశారు. తాము గెలిపించుకున్న నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటూనే... ప్రజా ప్రయోజనాల విషయంలో ప్రత్యర్థి రాజకీయ నాయకులకు కూడా బాసట నిలిచే మంచితనం వారిని కుంట్లూరు గ్రామంలో, పెద్ద అంబర్ పేట్ నిఖార్సైనా రాజకీయ నాయకులను చేసింది.



### రాజకీయం కంటే ప్రజా ప్రయోజనమే ముఖ్యం...

గ్రామంలో సర్పంచ్ నుంచి సింగిల్ విండో చైర్మన్‌గా, ఇటీవలే మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా పదవీ కాలం ముగిసిన కూడా ప్రజా ప్రయోజనాలకు తొలి ప్రాధాన్యతనిస్తున్నారు. మున్సిపల్ కౌన్సిల్‌లో అడుగు పెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు చామ సంపూర్ణవిజయ శేఖర్ రెడ్డి గ్రామాభివృద్ధి కోసం ఏకంగా రూ.5060కోట్లు నిధులు తీసుకువచ్చింది. ఈ నిధులను కేవలం కుంట్లూరు గ్రామ పరిధిలో ఉన్న వార్డులు, వాడలు,కొత్తగా ఏర్పాటైన కాలనీలలో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు వినియోగించారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కానీ మురుగు నీటి వ్యవస్థ, కుంట్లూరు పెద్ద చెరువు ఆధునీకరణతో గ్రామస్తుల ఎదుర్కొంటున్న దుర్వాసన, దోమలను విముక్తి కల్పించారు. ఇక మున్సిపాలిటీ పరిధిలో నీట మునిగే తట్టి అన్నారంకు వరద ముంపు తొలగించేలా రూ. 10 కోట్లతో నిర్మిస్తున్న భారీ ట్రంక్ లైన్ నిర్మాణంతో తమ ప్రాంత ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించారు.

### ప్రభుత్వ భూములకు రక్షణగా...

**బల్దియా పరిధిలో ప్రభుత్వ భూములకు రక్షణగా, పేదలు నిర్మించుకునే ఇళ్లకు సత్వర భవన నిర్మాణ అనుమతులు, తాగునీటి వసతులు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి కృషి చేశారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలో అన్యాక్రాంతం అవుతున్న పేదల భూములను పరిరక్షించి, పార్కులు డెవలప్ చేసేందుకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. ఈ క్రమంలో కుంట్లూరు గ్రామ పరిధిలో పలు సర్వే నెంబర్లలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నాలుగు పార్కులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికతో ఉన్నారు. అదే విధంగా కుంట్లూరు మెయిన్ జంక్షన్‌లో 2014 తీర్మాణం చేసినట్లుగానే వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ యార్డ్ నిర్మాణంలో ఏమాత్రం రాజీపడకుండా, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. అదేవిధంగా కుంట్లూరు వచ్చే మార్గంలో భారీ కల్వర్ట్ నిర్మాణంతో మురుగు నీటిలో నడుస్తూ ఇబ్బంది పడుతున్న ఎంతోమంది పాదచారులకు ఊరట కలిగించారు. ఇక పేదలకు బాసటగా నిలుస్తూ, ప్రజా సేవకు నిస్వార్థంగా పనిచేస్తున్న తమలాంటి వారిపై రాజకీయ ప్రత్యర్థులు ఉన్నా... గ్రామాభివృద్ధి, ప్రజా సేవలో రాజకీయాలకు అతీతంగా వ్యవహారించే చామ సంపూర్ణ-విజయశేఖర్ రెడ్డి కుటుంబం నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తోంది.**

## పంచముఖి ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



**పటాన్ చెరు,విశాలభారతి**

భారతినగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలోని శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ఆలయాన్ని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు నందగోపాల్, మధుసూదన్ రెడ్డి, రాజీ రెడ్డి, శ్రీలత, రజిత, యూత్ నాయకులు సుధాకర్, వెంకట్ రెడ్డి, విజయ్, రాకేష్ పాల్గొన్నారు.



# మధ్యతరగతికి ఊరట కలిగించేలా కేంద్ర బడ్జెట్

- మోదీ చిత్రపటానికి బీజేపీ నేతల పాలాభిషేకం

**తుర్కయంజాల్,విశాలభారతి:**

పేద, మధ్య తరగతి ప్రజలకు లాభం చేకూర్చేలా కేంద్ర సర్కార్ బడ్జెట్ ప్రవేశపెట్టడం హర్షనీయమని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. బీజేపీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో రూ.12లక్షల వరకు పన్ను మినహాయింపునివ్వడం మధ్యతరగతి వర్గాలకు ఎంతో ఉపయుక్తమన్నారు. అలాగే కిసాన్ క్రెడిట్ కార్డు లిమిట్ రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడం హర్షించదగినదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్, సీనియర్ నాయకులు తూళ్ల నర్సింహగౌడ్, కొత్త రాంరెడ్డి, అర్జున్‌గౌడ్, పలుస శ్రవణ్, బాలకృష్ణగౌడ్, భిక్షపతి, కొంతం బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, విశాల్‌గౌడ్, సూరి, కొమ్మం శివ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి కాలనీలో వెలుగుల కోసం లైట్లను మంజూరు

- కార్పొరేటర్ సుజాత నాయక్.

**ఎల్బీనగర్ ,విశాలభారతి :**

హస్తినాపూర్ డివిజన్ లోని వివిధ కాలనీలో విద్యుత్తు లైటులను బిగిస్తున్నట్లు కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ తెలిపారు. డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ తోపాటు వివిధ కాలనీలో విద్యుత్ లో లైట్లు బిగించడం జరుగుతుందని కార్పొరేటర్ తెలపడం జరిగింది. ప్రతి కాలనీలో వెలుగులు ఉండే విధంగా సుమారు వందలైట్లను మంజూరు చేయించినట్లుగా తెలిపారు. ఇంకా ఎక్కడైనా అవసరం ఉంటే మంజూరు చేయించి విద్యుత్ లైట్లను బిగించనున్నట్లు తెలిపారు రాబోయే రోజుల్లో హెమాస్ట్ లైట్లు కూడా మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి,కృష్ణా గౌడ్,గంధం శ్రీను మమత,మల్లేష్ గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## ఏకెవిఆర్ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

- విద్యార్థులకు పలు జాగ్రత్తలు సూచించిన డాక్టర్ రుబీనా

**విశాలభారతి,భీమదేవరపల్లి :**

క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వంగర వైద్యాధికారులు డాక్టర్ ముతార్ రహ్మాన్, డాక్టర్ రుబీనా అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ముల్కనూర్ ఏకెవిఆర్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్యాన్సర్ వ్యతిరేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం, గుట్కా, తంబాకు, గంజాయి, నిలువ ఉన్న పచ్చళ్ళు, ఫ్రిజ్‌ల్లో ఎక్కువ రోజులు నిలువ ఉంచిన ఆహార పదార్థాలు, బేకరీ ఫుడ్‌లు, ఐస్‌క్రీమ్స్. కూల్‌డ్రింక్స్ తదితర వాటిని విరివిగా వాడటం వల్ల కాన్సర్ వ్యాధికి గురవుతారని తెలిపారు. తద్వారా నోటీ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, లంగ్స్ క్యాన్సర్, బోన్స్ క్యాన్సర్, బ్లడ్ క్యాన్సర్ లాంటివి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్, కళాశాల విద్యార్థులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా కడారి ప్రభాస్

**విశాలభారతి,భీమదేవరపల్లి :**



మండలంలోని ముల్కనూర్ లో ఎమ్మార్పీఎస్ మండల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాదిగ జాతి కోసం నిరంతరం కృషి చేస్తున్న ముత్తారం గ్రామానికి చెందిన కడారి ప్రభాస్ ను మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షునిగా హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి మాడుగుల వెంకటస్వామి ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వెంకటస్వామి మాట్లాడుతూ, ఈ నెల 7 న, హైదరాబాదులో జరిగే మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐలపాక స్వామి, పార్నందుల మహేందర్, గజ్జల వెంకటస్వామి, తాళ్లపల్లి ఆశీర్వాదం, కనకం రాజ్ కుమార్, దిలీప్, రమేష్, గజ్జల రవీందర్, కడారి శ్రీనివాస్, రేనికుంట్ల ప్రసాద్, కడారి ఆదం, ప్రశాంత్, మ్యాక రాజు, తాదూరి చిరంజీవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# "అబద్ధాలతో అధికారంలోకి కాంగ్రెస్"

- అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్ పార్టీ
- ఈనెల 6 నుండి కార్యకర్తల సమావేశాలు
- జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ను ఎండగడుతామని వెల్లడి



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ పార్టీఅధికారంలోకి వచ్చిందని , ఇప్పటికీ అబద్ధాలతోనే కాలం విల్లదీస్తుందని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి విమర్శించారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మండలాల బీఆర్ఎస్ పార్టీ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత శాసనసభ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు , 420 హామీలతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి మహిళలకు ఫ్రీ బస్సు మాత్రమే అమలు చేయగలిగిందని చెప్పారు. బస్సుల సంఖ్య తగ్గించడంతో ఆ బస్సులు సిగపట్లకు వేదికలుగా మారాయని, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని అన్నారు. రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్తు ,500 కే వంట గ్యాస్ , రెండు లక్షల రుణమాఫీ సగం మందికి కూడా సక్రమంగా అందలేదని ఆయన దుయ్యబట్టారు. అరకొరగా అమలైన వీటిని సంపూర్ణంగా అమలు చేసినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ పాలనలో విడుదల చేసిన రూ. 7600 కోట్ల రైతుబంధు నిధులు గత పార్లమెంటు ఎన్నికల ముందు రైతుల ఖాతాల్లో వేశారని , కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా రైతు భరోసా నిధులు ఇవ్వలేదని అన్నారు. రెండు సార్లు రైతు భరోసా నిధులు ఎగ్గొట్టి , ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోసం పథకాల పేరిట నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. నాట్లప్పుడు ఇవ్వాల్సిన డబ్బులు మహిళలకు నెలకు రూ. 2500 , వృద్ధులకు రూ.4వేలు పింఛన్లు , వికలాంగులకు రూ 6వేలు పెన్షన్ , కళ్యాణలక్ష్మికి తులం బంగారం 420 హామీలు అమలు కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కిందని ఆయన విమర్శించారు. మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 6 నుండి మండలాల వారీగా కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి , జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి , మండల పార్టీ అధ్యక్షులు బుగ్గరాములు , చీరాల రమేష్ , కొత్త కిషన్ గౌడ్ , కార్యదర్శులు బహదూర్ నాయక్ , గంగిరెడ్డి భాస్కర్ రెడ్డి , పాశ్చ భాష , జిల్లా నాయకుడు జక్క రాంరెడ్డి , చిన్నోళ్ల యాదయ్య , మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య , మాజీ ఎంపిపి కృపేష్ , సొసైటీ చైర్మన్లు తోటిరెడ్డి రాజేందర్ రెడ్డి , మంచిరెడ్డి మహేందర్ రెడ్డి , బిట్ల వెంకట్ రెడ్డి, బద్రినాథ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



## ఇబ్రహీంపట్నం టూ నాగన్ పల్లి
# రోడ్డు మరమత్తులు చేపట్టండి

- రోడ్ల మధ్యలో గుంటలు అధికారుల నిర్లక్ష్యం
- రోడ్డుకు తాత్కాలిక మరమత్తులు చేసిన థర్డ్ బెటాలియన్ పోలీసులు

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

రాజకీయంగా, సామాజికంగా చైతన్యం కలిగిన ఇబ్రహీంపట్నంలో రోడ్లపరిస్థితి అక్కడక్కడ అధ్వాన్నంగా మారింది. ఏళ్ల తరబడి కొత్తరోడ్ల నిర్మాణాలు చేపట్టకపోతుండడం, అలాగే అధ్వానస్థితికి చేరుకున్న రోడ్లకు మరమతులు చేపట్టకపోతుండడం జనానికి శాపంగా మారుతోంది. ఇబ్రహీంపట్నం నుండి నాగన్ పల్లి కి వెళ్ళే రోడ్డు మరింత అధ్వాన్నంగా మారడంతో అటుగా వెళ్లే వారి పరిస్థితి భయానకంగా మారింది. కనీసం మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డు మరమత్తులు చేపట్టాలని పలుమార్లు విన్నవించినా అధికారుల నుండి స్పందన శూన్యం. రోజుకో రోడ్డు ప్రమాదం జరగడం ప్రయాణికులు గాయపడడం సాధారణంగా మారింది. ఇదంతా గమనించిన మంగళవారం థర్డ్ బెటాలియన్ పోలీసు బలగాల సిబ్బందితో రోడ్డుకు ఇరువైపులా గుంతలను మట్టితో నింపి, రోడ్డుకు అడ్డుగా ఉన్న మొక్కలను నరికి తాత్కాలిక మరమత్తులతో శ్రమదానం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం నుండి ఈ దారిలో నుంచి చాలా గ్రామాలకు లింకు రోడ్లు ఉన్నాయని, జరుగుతున్న ప్రమాదాలను పరిగణలోకి తీసుకుని సంబంధిత అధికారులు రోడ్డు విస్తరణ చేపట్టాలని వారు కోరారు. శ్రమదానంలో థర్డ్ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ పాషా, అదనపు కమాండెంట్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమాండెంట్ సోమని, ఆర్ఐ సంజీవరెడ్డి,వెంకటరమణ, మహేష్ తదితర పోలీస్ బలగాల సిబ్బంది పాల్గొన్నారు...



## రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన కార్పొరేటర్

**ఎల్బీనగర్ విశాలభారతి:**

హయత్ నగర్ మండల్ ఆఫీస్ ఆవరణలో ఉన్నటువంటి శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 16వ తేదీన జరుగరున్న రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట ఆహ్వాన మహోత్సవ పత్రికను హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ గ్రామ పెద్దలు కళ్లెం శంకర్ రెడ్డి , బిజెపి మల్కాజ్గిరి పార్లమెంటు జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ , బిజెపి డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీను, జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు పారంద మహేష్ , ఆలయ కమిటీ సభ్యులు ఎర్ర రవీందర్ , పారంద స్వామి , పిట్టల జంగం , శ్రీధర్ , క్రిష్ణ , సతీష్ , రవి ,ఇతర సభ్యులు పాల్గొన్నారు.



## చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- ఎమ్మెస్ఎఫ్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్చార్జి కందికంటి జగన్

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈనెల 7న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెస్ఎఫ్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్చార్జి కందికంటి జగన్ తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాదిగ విద్యార్థులతో డప్పు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ లక్ష డప్పులు వేల గొంతుకల పేరుతో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నియోజకవర్గం లోని మాదిగ సోదరులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందివనపర్తి ఎమ్మెస్ఎఫ్ గ్రామ శాఖ అధ్యక్షుడు ముచ్చర్ల రాకేష్, నాయకులు కాళ్ళ చరణ్,ముచ్చర్ల సాయి కిరణ్, ములి సూర్య తదితరులు పాల్గొన్నారు..



# అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకున్న ప్రజా బడ్జెట్

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
- రవి ప్రసాద్ గౌడ్

**సికింద్రాబాద్, విశాలభారతి:**

వికసిత భారత్ లక్ష్యంగా 50 లక్షల కోట్ల బడ్జెట్ దాటి 60 ఏళ్లు దాటిన వృద్ధులకు బ్యాంకులో వడ్డీలో పన్ను మినహాయింపు మరియు 12 లక్షల వరకు ఆదాయపు పన్ను లేకపోవడం కొత్తగా పన్ను చెల్లింపుదారులకు మార్పు లేకపోవడం వ్యాపారులకు ఉపాధి కల్పించే యం ఎస్ యం రంగానికి లక్షల నర కోట్లతో యువతకు ఉపాధి చేయూత అందించిన ఘనత మోడీదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ అన్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కి బౌద్ధ నగర్ డివిజన్ వారాసిగూడ చౌరస్తాలో డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణ దత్తు చైతన్య సంపత్, సుబ్బారావు, ఓములు, నర్సింగ్ రావు, సురేష్. బాలయ్య, హాజీ, జయంత్, తదితరులు పాల్గొన్నారు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
05.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




# బీసీ డిమాండ్స్ సాధనకై కలెక్టరేట్‌లో వినతులు

- **బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు పిలుపు**

**సూర్యాపేట,విశాలభారతి:**

బీసీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికై ఈ నెల 5న తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కలెక్టర్ కార్యాలయాలు, ఆర్డిఓ కార్యాలయాల్లో వివిధ డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాలు సమర్పించాలని నిర్ణయించినట్లు బీసీ హక్కుల సాధన సమితి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు తెలియజేశారు. మంగళవారం సూర్యాపేటలోని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యాలయంలో సంఘానికి చెందిన జిల్లా ఆఫీసు బ్యారర్ల తో కలిసి ఆయన మాట్లాడుతూ.... దేశవ్యాప్తంగా జనగణలలో కులగణన చేపట్టాలని, ఆ వచ్చే రిపోర్టు ను పట్టి ఆయా కులాల జలాభా నిష్పత్తి ప్రకారమే చట్టసభల్లో రిజర్వేషన్ తో పాటు విద్య వైద్య ఉపాధి రంగాల్లోనూ ఉద్యోగాల్లోను, ఉద్యోగాల ప్రమోషన్ లోను రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో రెండు ఎకరాల విస్తీర్ణంలో బీసీ భవన్ లు నిర్మించాలని, తెలంగాణలో ఇటీవల చేపట్టిన సర్వే ఆధారంగానే రాజకీయ రిజర్వేషన్ నిర్ణయించి స్థానిక ఎన్నికలకు వెళ్లాలని, స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం మాత్రమే రిజర్వేషన్ చేయాలన్న దాన్ని చట్టం చేయాలని, దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని పార్లమెంట్లో రాజకీయ రిజర్వేషన్లు అమలయ్యే దాకా ఇండియా కూటమి కృషి చేయాలని కోరారు. 42 శాతం స్థానిక సంస్థల రిజర్వేషన్ కు బిసి హక్కుల సాధన సమితి సమ్మతించదని, కచ్చితంగా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు నిర్ణయించాలని ఇంకా వివిధ డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్లకు, ఆర్డిఓ లకు సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట బీసీ హక్కుల సాధన సమితి సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాదే నరసయ్య, జిల్లా అధ్యక్షుడు దంతాల రాంబాబు, విద్యార్థి సంఘం నాయకుడు రేఖ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

**ఆమనగల్లు, విశాలభారతి :**

ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో జరుగుతున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రథాన్ని గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, ఆలయ ఛైర్మన్ సింగిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ రథోత్సవానికివివిధ గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రథోత్సవం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.







# గీతంలో త్యాగరాజ ఆరాధన వేడుకలు

**పటాన్ చెరు,విశాలభారతి**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో మంగళవారం ప్రముఖ పురాణ స్వరకర్త త్యాగరాజ ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని కళలు, ప్రదర్శనా కళల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సంగీతం, నృత్యం ద్వారా త్యాగరాజ వైభవం - త్యాగరాజ కృతులు, అనుభూతి, శైలి, ఔన్నత్యాలను మరోసారి మననం చేసుకుని, ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ వేడుకలో గాయకులు డాక్టర్ నిర్మల్ హరీష్, మృదురవళి దర్భల త్యాగరాజ కీర్తనలతో సహా ఆకర్షణీయమైన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. డాక్టర్ వై.లలిత సింధూరి, పీబీ వైష్ణవిలు కూచిపూడి, అంజు అరవింద్ భరతనాట్యం వంటి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో త్యాగరాజుకు నివాళులర్పించారు. కాగా, చంద్రకాంత్ మృదంగంపై, మహావాది వాసు విశ్వనాథ్ శాస్త్రి వయోలిన్ తో వారికి సహకారం అందించారు. తొలుత, ఈ కార్యక్రమం గాంధీ కూడలి నుంచి ఉత్సాహభరితమైన పల్లకీ సేవ (ఊరేగింపు)తో ప్రారంభమై, నామ సంకీర్తన యొక్క స్ఫూర్తిని చాటిచెప్పింది. భక్తులు సంగీతం ద్వారా తమ భక్తిని వ్యక్తపరిచే సంప్రదాయం, వారి కళకు గుర్తింపుగా వివిధ రూపాలలో సహకారం, మద్దతు పొందుతారు. ఈ ఆచారం త్యాగరాజ వారసత్వంలో లోతుగా పాతుకుపోయిన ఆయన దివ్య నామ సంకీర్తనలు, ఉత్సవ సంప్రదాయాలతో గౌరవించబడ్డాయి. త్యాగరాజ వైభవం సంగీతం, నృత్యం, సంప్రదాయాన్ని అందంగా మిళితం చేసి, భారతదేశపు గొప్ప సంగీత సాధువులలో ఒకరికి గీతం ఆత్మీయ నివాళి అర్పించింది.

**'సైబర్ బెదిరింపులకు నో చెప్పండి' వీధి నాటక ప్రదర్శన..**

సైబర్ బెదింపులను ఎదుర్కోవడానికి, సైబర్ నేరాల గురించి సమాజానికి అవగాహన కల్పించడానికి ఒక సృజనాత్మక ప్రయత్నం, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని అప్లైడ్ సైకాలజీ విభాగం చేసింది. 'సే నో టు సైబర్ బుల్లియింగ్' పేరిట వీధి నాటకాన్ని జేబ్లాక్ ముందు, ప్రధాన ద్వారం ఎదుటి రోడ్డు మీద ప్రదర్శించారు. ఆన్ లైన్ భద్రత గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న పలువురు విద్యార్థులను ఇది ఆకర్షించింది. సైబర్ నేరాన్ని గుర్తించడానికి, నిరోధించడానికి ఆచరణాత్మక దశలను ఈ నాటకం ప్రదర్శించి, అప్రమత్తత, బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రవర్తన ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. ఏదైనా సైబర్ బెదిరింపు సంఘటలు జరిగితే, వాటిని ప్రత్యేక హాట్ లైన్ 1930కు ఫిర్యాదు చేయడం, లేదా cybercrime.gov.in ని సందర్శించడం ద్వారా రక్షణ లేదా ఉపశమనం పొందవచ్చని ఆ నాటకం ద్వారా ఇచ్చిన సందేశంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన విద్యార్థి ప్రతినిధి అఫ్రీన్ మాట్లాడుతూ, 'డిజిటల్ యుగంలో తమను తాము రక్షించుకోవడానికి విద్యార్థులకు జ్ఞానం, సాధనాలతో సాధికారత కల్పించడమే మా లక్ష్యం. సురక్షితమైన ఆన్ లైన్ సంఘాన్ని సృష్టించడానికి ఈ వీధి నాటకం మా చొరవలలో ఒకటి' అని పేర్కొన్నారు. ఈ చొరవ విద్యార్థులు తమ చదువులో రాణించడమే కాకుండా, సమాచారం ఉన్న, చురుకైన పౌరులుగా మారేలా చేయడంతో పాటు, విద్యా నైపుణ్యాన్ని వాస్తవ ప్రపంచ సమస్యలతో అనుసంధానించడంలో గీతం నిబద్ధతను చాటి చెబుతోంది.



# వేదాంత భజన మందిరంలో ఘనంగా రథసప్తమి వేడుకలు

- **సూర్యప్రభ వాహనంపై ఊరేగిన శ్రీరామ చంద్రమూర్తి**

**సూర్యాపేట,విశాలభారతి:**

సూర్య భగవానుని ఆశీస్సులు ప్రజలందరిపై వుండాలని శ్రీ వేదాంత భజనమందిరం అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వర రావు తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో గల శ్రీ వేదాంత భజన మందిరం లో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సూర్యప్రభ వాహనంపై శ్రీ రామచంద్ర స్వామిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆదిత్య హృదయం స్తోత్రం పఠించారు. సూర్య భగవానునికి నైవేద్యం సమర్పించి, భక్తులకు వితరణ చేశారు.అనంతరం పట్టణంలో కొలాటాలతో శోభాయాత్ర నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు ధరూరి సింగరాచార్యులు మాట్లాడుతూ సూర్య భగవానుడు ఉత్తరాయణం లో ప్రవేశించి తన వీక్షనతను లోకానికి చూపిస్తాడని,నేటి నుండి వేసవికాలం ప్రారంభం అవుతుందని,సూర్యుని ప్రతాపంతో ఎండలు మండిపోయినా తరువాత చల్లని వర్షాలు పడి పంటలు పండి రైతులు సంతోషంగా వుంటారని అన్నారు.ఈ పూజాకార్యక్రమాలలో అర్చకులు దరూరి రాఘవాచార్యులు, దరూరీ రామానుజాచార్యులు, ఆలయ ప్రధాన కార్యదర్శి నకరికంటి నాగరాజు, కోశాధికారి సోమ అశోక్, భక్తులు చల్లా సత్యనారాయణ, సందీప్, చిల్లంచర్ల సోమేష్, గోరంట్ల సందీప్ వుద్ద శ్రీనివాస్, సోమ రాజు, చిత్తలూరి శ్రీధర్, వరగాని వెంకటేశ్వర్లు, శీలా శంకర్, రాచర్ల ప్రేమలత, నకరికంటి హేమలత, మౌనిక, రమ, స్వాతి, బిందు, కళ్యాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నాగ సురేష్ నియామకం

**ఆర్మూర్,విశాలభారతి:**

నిజామాబాద్ జిల్లా నందిపేట్ కు చెందిన నాగ సురేష్ బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నియమితులయ్యారు నాగ సురేష్ విద్యార్థి దశ నుండి విద్యార్థి పరిషత్ లో అనేక సంవత్సరాలు పనిచేసి విద్యారంగ సమస్యల పైన అనేకమైన పోరాటాలు చేశారు ,భారతీయ జనతా యువ మోర్చాలో జిల్లా ఉపాధ్యక్షులుగా సమర్ధవంతంగా పనిచేసినందుకుగాను జిల్లా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గా నియమించడం జరిగింది, ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధిష్ఠానం మంగళవారం ఆయన పేరును ప్రకటించింది. ఈ సందర్భంగా నాగ సురేష్ మట్లాడుతూ.. తనపై నమ్మకంతో నియమకానికి సహకరించినటువంటి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ,ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ,జాతీయ పసుపు



బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి , నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కులచారి దినేష్ పటేల్ కు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. తనకు పార్టీ అధినాయకత్వం ఇచ్చిన బాధ్యతకు సంపూర్ణ న్యాయం చేస్తానన్నారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తానని, తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు,నందిపేట్ మండల బిజెపి నాయకులు హర్షం వ్యకం చేశారు.



# అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్

**ఆర్మూర్, విశాలభారతి:**

పెర్కిట్ లోని 20వ, వార్డులో గల అంగన్వాడి కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు మంగళవారం తనిఖీ చేశారు. బాలింతలు, గర్భిణులకు మూడు సంవత్సరాల లోపు పిల్లలకు రేషన్ ను మరియు పాలు ,గుడ్డు తప్పనిసరిగా అందించాలని నిర్వాహకులకు సూచించారు. పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలని అన్నారు. హాజరు పట్టిక వండిన ఆహారాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులు ఆయా కేంద్రాలను విధిగా సందర్శించాలని కోరారు.



# ప్రతి ఒక్కరూ టిబి నిర్ధారణ పరిక్షలు చేయించుకోవాలి

- **45 వ వార్డు మాజి కౌన్సిలర్ గండూరి పావని క్రపాకర్.**

**సూర్యాపేట,విశాలభారతి:**

ప్రతి ఒక్కరూ టిబి నిర్ధారణ పరిక్షలు చేయించుకుని తమ ఆరోగ్యం పరిరక్షించుకోవాలని సూర్యాపేట 45 వ వార్డు మాజి కౌన్సిలర్ గండూరి పావని క్రపాకర్ అన్నారు. మంగళవారం విద్యానగర్ లోని గండూరి రామస్వామి వాటర్ ప్లాంట్ వద్ద వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టిబి నిర్ధారణ, బిపి, షుగర్ పరీక్షలను గండూరి పావని క్రపాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 2016 లో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ రాష్ట్రములో టిబి వ్యాధిని అరికట్టాలనే ఉద్దేశ్యంతో టిబి వ్యాధి పరిక్షలు, నివారణకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారని, దాని ఫలితంగా టిబి వ్యాధిని 75 శాతం వరకు అరికట్టడం జరిగిందన్నారు. నేడు కేంద్ర ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో టిబి నిర్ధారణ పరీక్షలతో పాటు బిపి, సుగర్ పరిక్షలను ఉచితంగా చేసి, టిబి పాజిటివ్ వచ్చిన వారికి మూడు నెలల పాటు మందులు ఇస్తారని తెలిపారు. టిబి వ్యాధిని ప్రాధమిక దశలోనే గుర్తించాలని, లేకపోతే శరీరంలో వ్యాపించి జీర్ణవ్యవస్థ ను దెబ్బతీస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు గండూరి క్రపాకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మర్రి లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి రవీందర్ రెడ్డి, గుడిపూడి వెంకటేశ్వర రావు, బెజగంఫణి, మిట్టపల్లి రమేష్, బజ్జూరి శ్రీనివాస్, డాక్టర్ శివప్రసాద్, సూపర్వైజర్ ఏకస్వామి, సుష్మ,ల్యాబ్ టెక్నషియన్, ఎస్ పిఎల్ఇ వెంకట్, ఆశా కార్యకర్తలు విజయ, మణెమ్మ, శ్రీలత, కుక్కడపు భిక్షం, సందీప్, కళ్యాణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# అరబ్ అడ్వొకేట్‌తో చర్చించిన అనిల్ ఈరవత్రి

**బాల్కొండ,విశాలభారతి**

మాజీ ఎమ్మెల్యే,రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి యూఏఈ దేశం దుబాయిలోని ప్రముఖ లీగల్ కన్సల్టింగ్ సంస్థ మహ్మద్ సల్మాన్ అండ్ లీగల్ కన్సల్టెంట్స్ సంస్థను మంగళవారం సందర్శించారు.అరబ్ అడ్వొకేట్ సాద్ మహ్మద్ అల్ మర్జూఖి,భారతీయ న్యాయవాదులు బిందు ఎస్ చెట్టూర్, అశ్విన్ చతుర్వేదిలతో గల్ఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయపరమైన అంశాలు వాటి పరిష్కారాల గురించి చర్చించారు.2010లో షార్జాలో 17 మంది భారతీయులను ఉరిశిక్ష నుంచి తప్పించడంలో బిందు కీలకంగా వ్యవహరించారు.అనిల్ వెంట నంగి దేవేందర్ రెడ్డి,మంద భీంరెడ్డి, సుతారి సత్యం,పబ్బ భూమేష్ పాల్గొన్నారు.



# అర్బన్ పార్కు,శానిటేషన్ పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**బాల్కొండ,విశాలభారతి:**

భీమ్‌గల్ మున్సిపాలిటీ లోని అర్బన్ పార్కును,వివిధ వార్డులలో జరుగుతున్న శానిటేషన్ పనులను మంగళవారం కమీషనర్ గోపు గంగాధర్ పరిశీలించారు. అర్బన్ పార్క్ ను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. మొక్కలకు తప్పనిసరిగా నీటిని అందించాలన్నారు. వార్డులలో చెత్త సేకరిస్తున్న వాహనాలను పరిశీలించి డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.ప్రజల నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తప్పనిసరిగా చెత్తను మున్సిపల్ వాహనానికిఅందించాలన్నారు.పట్టణంలోని ప్రతి ఒక్కరూ చెత్తను ఎక్కడంటే అక్కడ పాడేయకుండా మున్సిపల్ వాహనాల్లోనే వెయ్యాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ కే.నవీన్, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీధర్,ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఓంకార్,జవాన్ రాజయ్య మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
05.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## వైద్య ఖర్చులకు సహాయం అందించిన జనం కోసం మనం



**మణుగూరు, విశాల భారతి :** మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన కారం సీతారాములు 40 సంవత్సరాలు ప్రమాదవశాత్తు కరెంటు పోలు పైనుంచి పడి తీవ్ర గాయాలయి మంచానికి పరిమితమై ఏ పని చేసుకోలేని పరిస్థితుల్లో వైద్య ఖర్చులకి ఇబ్బంది పడుతున్నారని తెలిసి మణుగూరు పట్టణానికి చెందిన జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ స్పందించి 15 వేలు నగదు,50 కేజీలు బియ్యం,నిత్యావసర సరుకులు సహాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ పౌండర్ గూడూరు కృష్ణారెడ్డి సభ్యులు కొండా మురళీ,పునాటి పాపయ్య, వారా రామారావు తదితరులు పాల్గొన్నారు.



## భీమ్‌గల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ సభ్యులు

**బాల్కొండ,విశాలభారతి :** భీమ్‌గల్ నూతన సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన గోపు గంగాధర్ ని మర్యాదపూర్వకంగా కలిసి,శాలువాతో సత్కరించి,స్వాగత శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం పట్టణంలోని సమస్యలపై కమీషనర్ తో చర్చించారు.పట్టణంలో దోమల బెడత ఎక్కువ ఉన్నందున టౌన్ మొత్తం స్ప్రే చేయించాలని విడిసి తరపున కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.దానికి కమిషనర్ సానుకూలంగా స్పందించి, తొందర్లోనే స్ప్రే చేపిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని సర్వ సమాజ్ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్వ సమాజ్ కమిటీ అధ్యక్షుడు నీలం రవి ,ఉపాధ్యక్షుడు బార్ల మోహన్,క్యాషర్ కాపు కుమారి హరీష్, రైటర్ పర్సు నవీన్,సలహా కమిటీ సభ్యులు కర్నే మహేందర్,తోపారం సురేందర్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## బిసి విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షునిగా బొల్లెపల్లి సాయి కుమార్ గౌడ్

- నిద్ర సంపత్ నాయుడు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు

**నూతనకల్, విశాలభారతి:** బిసి విద్యార్థి సంఘం నియోజకవర్గ తుంగతుర్తి అధ్యక్షునిగా బొల్లెపల్లి సాయి కుమార్ గౌడ్ ను నియమించడం జరిగిందని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నిద్ర సంపత్ నాయుడు తెలిపారు. సోమవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో నూతనకల్ కు చెందిన బొల్లెపల్లి సాయి కుమార్ గౌడ్ ను బీసీ విద్యార్థి సంఘ అధ్యక్షునిగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు నియమించడం జరిగింది అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నిద్ర సంపత్ నాయుడు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైనా సాయి కుమార్ బీసీల కొరకు అదేవిధంగా విద్యార్థుల సమస్యల పరిష్కారం కొరకు జాజుల శీనన్న నాయకత్వంలో పనిచేయాలని సూచించారు. సంఘ నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణి, సాయి కుమార్, సందీప్,రఘువరన్, వెంకటేష్ పాల్గొన్నారు.



## స్వీయ జాగ్రత్తలతో క్యాన్సర్ దూరం

**తొర్రూరు, విశాలభారతి:** స్వీయ జాగ్రత్తలతో క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చని ఏరియా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్ రాజు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుగుణాకర్ రాజు మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేయని పరిస్థితులు క్యాన్సర్ కు కారణమవుతున్నాయని తెలిపారు. తొలి దశలోనే క్యాన్సర్ ను గుర్తిస్తే నయం చేయడం సులువేనని తెలిపారు. క్యాన్సర్ వ్యాధి నివారణలో స్క్రీనింగ్ అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుందని, నివారణకు అవకాశం ఉన్న క్యాన్సర్లు అయిన రొమ్ము క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్, నోటి క్యాన్సర్‌లను ప్రారంభదశలోనే గుర్తించడం ద్వారా చాలా వరకూ నివారించవచ్చని తెలిపారు. ఫాస్ట్ ఫుడ్ కు దూరంగా ఉండాలని, శారీరక వ్యాయామం జీవితంలో భాగంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జ్వలిత, వైద్యులు మీరాజ్, ప్రియాంక, మానస, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## మృతి చెందిన రాజు కుటుంబానికి కె.ప్రసాద్ రెడ్డి ఆర్థిక సహాయం

- ప్రగాఢ సానుభూతి తెలియజేసిన పారిశ్రామికవేత్త కె.ప్రసాద్ రెడ్డి

**జహీరాబాద్, విశాలభారతి:** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పిచేర్యాగడి పాతతాండలో రామావత్ రాజు తండ్రి,మరోతి (28)సం,,రాలు సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో భార్య భర్తల మధ్య చిన్న గొడవ కావడంతో రాజు ఊరి వేసుకొని ఆత్మ హత్య చేసుకొన్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేత కె.ప్రసాద్ రెడ్డి,చింతిస్తూ మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసీ అంతక్రియల ఖర్చు నిమిత్తం రూ.10 వేల రూపాయలు, కాంగ్రెస్ పార్టీ కోహీర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్,కు ఫోన్ ద్వారా పంపి తాండ పెద్దల,చేతుల మీదుగా తాండ కాంగ్రెస్ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులకు పంపిణి చేశారు.ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త జహీరాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ నాయకులు కె.ప్రసాద్ రెడ్డి ,మృతుని కుటుంబానికి ధైర్యం కల్పించి అన్ని విధాలుగా అండగా భరోసాగా ఉంటానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తాండ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా డెయిరీలో గడ్డి విత్తనాల ఉత్పత్తి వర్క్ షాప్

- హాజరైన ఢిల్లీ సైంటిస్టులు
- ఫీల్డ్ విజిట్ లో రైతుల సందేహాలకు సలహాలు, సమాధానాలు

**విశాలభారతి,భీమదేవరపల్లి:** ప్రసిద్ధిగాంచిన ములుకనూరు మహిళ డెయిరీలో అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ అధ్యక్షతన, జనరల్ మేనేజర్ మారుపాటి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో "గడ్డి విత్తనాల ఉత్పత్తి" సంబంధించిన వర్క్ షాప్, క్షేత్ర పర్యటన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గోపాల్ పూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో రైతుల సందేహాలకు సైంటిస్టులు సలహాలు అందించారు. ఇంకా అధిక దిగుబడి గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా న్యూఢిల్లీ ఐఐఎంఆర్ సైంటిస్ట్ హెచ్ఎస్ జాట్, సీనియర్ సైంటిస్ట్ భూపేంద్ర కుమార్, సీనియర్ మేనేజర్ లు సునీల్ కుమార్, క్రితిగ, మేనేజర్లు వినోద్ యూకి, దీపబెనివాల్ మరియు రైతులు, డైరీ సిబ్బంది పాల్గొన్నారు.





## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**దేవరుప్పుల, విశాలభారతి:** పాలకుర్తి నియోజకవర్గం శాసన సభ్యురాలు హనుమాండ్ల యశస్విని రెడ్డి, ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్ల శ్రీరామ్, గార్ల ఆదేశాల మేరకు నేడు పెద్దమడూరు గ్రామ కంటెస్టెడ్ ఎంపీటీసీ ముదిగొండ పరశురాములు గారి తల్లి మీదిగొండ సోమక్క గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న రాత్రి మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో పెద్దమడూరు గ్రామ పార్టీ అధ్యక్షులు భువనగిరి నరసింహ, ఉపాధ్యక్షులు రాపాక యాదగిరి. మండల బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు కాడబోయిన గణేష్, ఇనుముల నాగరాజు, భూక్య సజ్జన్, గులాం రసూల్, బోనగిరి యాకస్వామి, దావెర అనిల్ కుమార్, మాజీ ఎంపిటిసి జాకీర్ ,కాడబోయిన వెంకన్న, దౌపాటి నరసయ్య, రెడ్డి రాజుల రమేష్, పల్లపు రవి, ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షులు కొంగరి ఉమేష్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గనుపాక ప్రదీప్, చింత నిఖిల్, యువజన నాయకులు పానుగంటి కిరణ్ కుమార్, దండు ప్రశాంత్, పానుగంటి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



## భీమ్‌గల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేసిన సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ సభ్యులు

**బాల్కొండ,విశాలభారతి :** భీమ్‌గల్ నూతన సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన గోపు గంగాధర్ ని మర్యాదపూర్వకంగా కలిసి,శాలువాతో సత్కరించి,స్వాగత శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం పట్టణంలోని సమస్యలపై కమీషనర్ తో చర్చించారు.పట్టణంలో దోమల బెడత ఎక్కువ ఉన్నందున టౌన్ మొత్తం స్ప్రే చేయించాలని విడిసి తరపున కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.దానికి కమిషనర్ సానుకూలంగా స్పందించి, తొందర్లోనే స్ప్రే చేపిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని సర్వ సమాజ్ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్వ సమాజ్ కమిటీ అధ్యక్షుడు నీలం రవి,ఉపాధ్యక్షుడు బార్ల మోహన్,క్యాషర్ కాపు కుమారి హరీష్, రైటర్ పర్సు నవీన్, సలహా కమిటీ సభ్యులు కర్నే మహేందర్, తోపారం సురేందర్,మహేష్ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శత చండీయాగం

**ఆర్మూర్, విశాల భారతి.** నందిపేట మండలం చౌడమ్మ కొండూరు గ్రామంలో శత చండీయాగ మహోత్సవం జరుగుతుంది. దీనిలో భాగంగా రెండవ రోజు గ్రామంలో ని దంపతులతో ఆలయంలో చండి హోమం, ఆవాహిత పూజలు అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పంచ మండప ఆరాధన, ఆదివాస హోమము, పంచసూక్త ఆవానము, చండీ హోమము నిర్వహించారు. విగ్రహాలకు పంచామృత అభిషేకము నవరత్న తైల, అభిషేకము మహా పూజ మహా హారతి



మంత్రపుష్పము తీర్థ ప్రసాదముల వితరణ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు రామకృష్ణ, రాజేశ్వర్ శర్మ ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మాజీ సర్పంచ్‌ల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

- తీగల దయాకర్ గౌడ్

**దేవరుప్పుల, విశాలభారతి:** అసెంబ్లీ సమావేశం ఉన్నందున దేవరుప్పుల మండలంలోని మాజీ సర్పంచ్ లను ముందస్తు అరెస్టులు చేసి ఉదయం దేవరుప్పుల మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు.సర్పంచ్ ల పెండింగ్ బిల్లులు విడుదల చేయకుండా ఇలాంటి అక్రమ అరెస్టులు చేయడం సరికాదని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండి పడ్డారు. అరెస్టయిన మాజీ సర్పంచ్ లు బానోత్ గేమా నాయక్, బానోత్ రాజన్న,వంగ అర్జున్,బండి నరసింహులు,వర్రే మధు, గోపదాసు మల్లేష్ ఉన్నారు.వారి వెంట బిఆర్ఎస్ మండల కార్యదర్శి చింత రవి,నాయకులు జోగు సోమనర్సయ్య, పరుషరాములు ఉన్నారు.



## ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**దేవరుప్పుల, విశాలభారతి:** పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో నిరుపేదల, మధ్య తరగతి ప్రజల, రైతుల కోసం నిధులు కేటాయించినందుకు భారతీయ జనతా పార్టీ దేవరుప్పుల మండల అధ్యక్షుడు పెద్దగౌని రాజు ఆధ్వర్యంలో మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరుపేదల కోసం బడ్జెట్లో నిధులు కేటాయించడం, రైతులకు కోసం కిషన్ క్రెడిట్ కార్డు లిమిట్ 3లక్షల నుంచి 5లక్షల వరకు పెంచడం ,అదేవిధంగా మధ్యతరగతి ఉద్యోగుల ఆదాయ పన్ను పరిమితిని 12 లక్షల వరకు జీరో టాక్స్ విదించడం ఇలా చెప్తే పోతుంది అనేక సంక్షేమ నిధులు ఒక రాష్ట్రానికి ఎక్కువ మరొక రాష్ట్రానికి తక్కువ అని కాకుండా దేశంలో ఉన్న ప్రజలంతా సమానమే అనే భావనతో నిధులు కేటాయించారని ,10 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన నిధులతో పోలిస్తే పదిరెట్లు నిధులు పెరిగాయని ,దీనిని హర్షించాల్సిన విషయమని తెలియచేశారు.ఈ కార్యక్రమం లో జిల్లా సీనియర్ నాయకులు కాసాని సత్యనారాయణ,ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి అజయ్, మండల ఉపాధ్యక్షుడు చాలుకాని శ్రీను యాదవ్,మడికొండ మహేష్, సీనియర్ నాయకులు మైదం నాగేంద్ర, యువ మోర్చా నాయకులు సంగి రాజు, మడికొండ కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు అరుణోదయల రాష్ట్ర స్థాయి విలీన సభకు తరలిరండి

**సూర్యాపేట,విశాలభారతి:** సూర్యపేట జిల్లా కేంద్రంలోని తిరుమల గ్రాండ్ లో బుధవారం జరిగే రెండు అరుణోదయల రాష్ట్ర స్థాయి విలీన సభను జయప్రదం చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సూర్యాపేట జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు ఉదయగిరి,కంచనపల్లి సైదులు కోరారు.స్థానిక చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విలీన సభను జయప్రదం చేయాలంటూ పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ 2013లో చీలినటువంటి ఆరుణోదయ సంస్థలు రెండు సూర్యాపేట లో ఏకం కానున్నట్లు తెలిపారు. ఈ సభకు ప్రొఫెసర్ ఖాసీం సార్ హాజరై ప్రసంగిస్తారని, దీనిలో పెద్ద ఎత్తున కవులు, కళాకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సభకు ముందు సూర్యాపేట పట్టణంలో పాత మార్కెట్ యార్డ్ నుండి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ ఉంటుందని, ఈ సభలో వివిధ జిల్లాలకు చెందిన కవులు, కళాకారులు హాజరవుతున్నారని తెలియజేశారు.ఈ సమావేశంలో అరుణోదయం జిల్లా కమిటీ సభ్యులు సామ నర్సిరెడ్డి, బోల్క పవన్, పిడమర్తి భరత్ పాల్గొన్నారు.



vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

బుధవారం,
05.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ఘనంగా వేణుగోపాల స్వామి కళ్యాణం



**ఆమనగల్లు, విశాలభారతి :** కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామ సమీపంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చరణాల మధ్య ఆలయ అర్చకులు స్వామివారి కల్యాణాన్ని చేపట్టారు. అనంతరం కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



# లక్ష డప్పులు వేలాది గొంతుల కరపత్రాలు విడుదల చేసిన పొదెం

- సామాజిక న్యాయం కాంగ్రెస్ ధ్యేయం
- తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య

**కొత్తగూడెం, విశాలభారతి:** భద్రాచలం పట్టణ కేంద్రం లో మంగళవారం లక్షలాది డప్పులు వేలాది గొంతుల కర పత్రాలను ఎక్స్ ఎమ్మెల్యే, పిసిసి సీనియర్ వైస్ ప్రెసిడెంట్, డిసిసి ప్రెసిడెంట్ తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్య ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్ నడి బొడ్డున జరిగే మాదిగల సాంస్కృతిక మహా ప్రదర్శనను ప్రపంచం మొత్తం మాదిగల వైపు చూసే విదంగా చిర్రలు, చిటికెడు పుల్లలతో డప్పులతో హైదరాబాద్ రాజధాని లో ఎన్నడూ జరగని రీతిలో పెద్దలు పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపుకు మాదిగ, మాదిగ ఉపకులాలు ఎర్రని ఎండలో గుండెమీద డప్పు పెట్టి కొట్టడానికి మాదిగలు సిద్ధం కావాలి అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ కట్టుబడి ఉందని, ఎస్సీల ఏబిసిడి వర్గీకరణ అసెంబ్లీలో ఆమోదించడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనగారిన కులాల హక్కుల కోసం నిరంతరం తపిస్తుందని అన్నారు. మాదిగ మాదిగ ఉప కులాలు చేసిన న్యాయ పోరాటానికి పూర్తి మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఎంఎస్పి ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు, భద్రాచలం మండలం ఇంచార్జ్ అలవాల రాజా మాదిగ పెరియార్, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షులు మేకల లత, జిల్లా ఉపాధ్యక్షులు కొచ్చర్ల కుమారి, కొప్పుల నాగమణి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గొడేటి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సెల్ పీకింగ్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం చెయ్యాలి

- ఏఐటీయూసీ మణుగూరు ఏరియా కార్యదర్శి ఆదేర్ల సురేందర్ డిమాండ్



**మణుగూరు, విశాలభారతి:** సెల్ పీకింగ్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం చెయ్యాలని ఏఐటీయూసీ మణుగూరు ఏరియా కార్యదర్శి ఆదేర్ల సురేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మణుగూరు ఓసి మేనేజర్ బైరెడ్డి వెంకటేశ్వర్లు కి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మణుగూరు ఓ సీ లో సెల్ పీకింగ్ కాంటాక్ట్ కార్మికులకు నెల నెల వేతనాలు చెల్లించడంలో జాప్యం చెయ్యడంతో కుటుంబ పోషణ భారంగా మారి జీతాలు అందక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వక్తం చేశారు. వారి ఆర్థిక పరిస్థితిని గమనించి సదరు కాంట్రాక్టర్ వద్దనుండి వేతనాలు సరైన సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకు ద్వారా వేతనం చెల్లిచాలని డిమాండ్ చేశారు. ఎలాంటి గుర్తింపు కార్డులు మరియు జీతం చిట్టీలు ఇవ్వడంలేదని, లెక్కలతో కూడిన సీయంపియఫ్ పాస్ బుక్స్ వెంటనే ఇవ్వాలని బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లింపు జరగడంలేదని సింగరేణి సంస్థ మంచి ఆలోచనతో కాంట్రాక్టు కార్మికులకు బ్యాంక్ ద్వారా నెలసరి వేతనం ఇస్తే ఇన్సరెన్స్ వర్తింపు చేస్తామని హెచ్ డి ఫ్ సీ బ్యాంకు వారు ఒప్పుకోవడం జరిగిన జీతాలు మాత్రం సదరు కాంట్రాక్టర్ అట్టి బ్యాంకు ద్వారా చెల్లింపు చెయ్యడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పిట్ ఏఐటీయూసీ నాయకులు జెల్లరాపు రమేష్, కాంట్రాక్టు కార్మికులు ప్రవీణ్, సుమంత్, సారయ్య, ప్రవీణ్ కుమార్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



# సూర్యాపేటలో జానారెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

- బీసీలని రాజకీయంగా, సామాజికంగా అనగదొక్కే కుట్ర
- బీసీ జేఏసీ నాయకులు ఆరోపన

**సూర్యాపేట, విశాలభారతి:** బీసీలని రాజకీయంగా, సామాజికంగా ఆగదొక్కటానికే బీసీల జనాభాను తక్కువగా చేసి చెబుతున్నారని,దానికి అంతర్గతంగా జానారెడ్డి కుట్రలు పన్నుతున్నారని ఆరోపిస్తూ మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్లో జానారెడ్డి దిష్టిబొమ్మను బీసీ జేఏసీ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు .. 2014లో కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేతో పోల్చితే 2024 లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ కులగణన సర్వేలో 21 లక్షల మంది బీసీ జనాభాను తగ్గించడం కాకుండా 16 లక్షల మంది ఓసి జనాభా పెరిగినట్లుగా కుట్ర పూరితంగా తప్పుడు లెక్కలు చూపారని, ఈ కుట్రలో జానారెడ్డి హస్తం ఉందని బీసీ జేఏసీ నాయకులు ఆరోపించారు... తక్షణమే తప్పుల తడకగా ఉన్న ఈ సర్వేను రద్దుచేసి మళ్లీ పూర్తి స్థాయిలో సర్వే ను నిర్వహించాలని తద్వారా బీసీలకు న్యాయంగా దక్కాల్సిన వాటా రాజకీయంగా సామాజికంగా దక్కేవరకు బీసీ జేఏసీ పోరాడుతుందని నాయకులు అన్నారు. ఈకార్యక్రమంలో కుంభం నాగరాజు, చాంద్ పాషా,వల్లాల సైదులు యాదవ్, మీర్ అక్బర్, ఆవుల అంజయ్య,సూపర్ సైదులు,చింతకాయల జానయ్య,బడుగులు నాగార్జున, అవుదొడ్డి శ్రీకాంత్,గుంటూరు విజయ్, ఉప్పునూతల కోటేష్, అన్వేష్,సేవ్య నాయక్,సుమన్,బీసీ సంఘాల నాయకులు, మహిళలు వందల సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆలయ మాజీ చైర్మన్‌కు మాతృవియోగం

- కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి

**విశాలభారతి, భీమదేవరపల్లి :** కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా తల్లి మణెమ్మ మంగళవారం వయోభారంతో శివైక్యం చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మృతికి గల కారణాలను తెలుసుకొని, మణెమ్మ పార్థివ దేవానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో ఈవో కిషన్ రావు, ముఖ్య అర్చక మొగిలిపాలెం రాంబాబు, నందనం సందీప్, తాటికొండ రమేష్, సిబ్బంది మాడిశెట్టి శ్రీధర్, ఎర్రోజు రాజకుమార్, జంపాల రాజేందర్, కొత్తకొండ గ్రామ మాజీ సర్పంచ్ కంకల సమ్మయ్య, కొంగొండ సమ్మయ్య కొంగల రామచంద్రారెడ్డి, మంగ రామచంద్రం తదితరులు ఉన్నారు.



# ఘనంగా రథసప్తమి

**ఆమనగల్లు, విశాలభారతి :** ఆమనగల్లు మండల కేంద్రంలో శ్రీ లక్ష్మి చెన్న కేశవ స్వామీ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో రథసప్తమి సందర్భంగా శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామీకి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రత్యేక పూజలలో ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాలే మల్లయ్య, గోరటి నర్సింహా, లండం చంద్రయ్య, లండం కృష్ణయ్య, గోరటి దేవేందర్, గుండమల్ల జగన్, ఎనమళ్ళ రమేష్, కోరే రవి, ఎనమళ్ళ పర్వతాలు, లండం మొగులయ్య, లండం సాలయ్య, లండం నర్సింహా, వడ్డెమోని రవి, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# సూర్య దేవాలయంలోఘనంగా రథ సప్తమి వేడుకలు

**శాలిగౌరారం, విశాలభారతి:** ఆకారం గ్రామంలో ఎంతో విశిష్టత కలిగిన సూర్య దేవాలయంలో దేవాలయ పరిరక్షణ కమిటీ, దాతల ఆధ్వర్యంలో రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలతో పాటు హోమం, అభిషేకాలు వేద మంత్రాలతో కన్నుల పండుగగా నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నప్రసాదం చేశారు.ఈ కార్యక్రమాలకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి పుష్ప, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందాల సమరం రెడ్డిమంజుల దంపతులు,మాజీ ఎంపిటిసి వలిశెట్టి ఇందిరసైదులు,వల్లాల మాజీ సర్పంచ్ షేక్ ఇంతియాజ్ అహ్మద్, బండపల్లి కొమురయ్య, జైపాల్ రెడ్డి,వేముల గోపినాథ్, గ్రామ పురోహితులు వావిలాల రామలింగయ్య శర్మ, గ్రామ పెద్దలు, సూర్య దేవాలయ పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# తాటి చెట్టుపై నుండి జారిపడి గీతకార్మికుడికి గాయాలు



**నూతనకల్, విశాలభారతి:** మండల పరిధిలోని దిర్శనపల్లి గ్రామానికి చెందిన గుండగాని రాఘవులు వృత్తి రీత్యా గీత కార్మికుడు రోజు మాదిరిగానే మంగళవారం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశత్తు తాటి చెట్టు పై నుండి జారిపడి తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకున్నది కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలోజారిపడి తీవ్ర గాయాలైనవి మెరుగైన వైద్యం కోసం 108 లోసూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిరుపేద కుటుంబమైన గుండగాని రాఘవుల గీత వృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నాడని అతని ప్రభుత్వం ఆదుకోవాలని తోటి గీత కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు.



# మార్చి నాటికి ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ పనులను పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

**విశాలభారతి, ఎల్కతుర్తి:** ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ పనులు మార్చికల్లా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అధికారులను ఆదేశించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని జంక్షన్ సుందరీకరణ పనులను కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలను వేరే చోటకు త్వరగా మార్చాలని, మురుగునీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సుందరీకరణ పనుల్లో భాగంగా చేపడుతున్న పనులను త్వరగా పూర్తిచేయాలని అన్నారు.ఆర్టీసీ బస్టాండ్ లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ త్వరగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వెంకటరమణ, ఆర్డీవో రాథోడ్ రమేష్, ఆర్టీసీ అధికారులు, కూడా అధికారులు పాల్గొన్నారు. సోలార్ ప్లాంట్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్అ నంతరం సూరారం గ్రామంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి భాగ్యలక్ష్మి, సరస్వతి మహిళా స్వయం సహాయక సంఘాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఈస్థలం యొక్క స్వభావాన్ని, గ్రూపుల ఆర్థిక పరిస్థితిని గ్రూప్ లీడర్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో డిఆర్డిఓ శ్రీను, రెడ్ కో డీఎం మహేశ్వర్ రెడ్డి ,ఆర్డీవో రాథోడ్ రమేష్ , సెర్ప్ డిపిఎం ప్రకాష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలను అందించాలి


- హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య

**విశాలభారతి,ఎల్కతుర్తి :** ఎల్కతుర్తిలోవైద్య సేవల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సహాయాన్ని అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల నిమిత్తం రోజు ఎంతమంది వస్తుంటారనే వివరాలను సంబంధిత ఆరోగ్య కేంద్రం వైద్యులను, సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీలో మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రతి నెల దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించి నిర్ధరణ పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షల ద్వారా గుర్తించిన బిపి, షుగర్ పేషెంట్లకు ఉచితంగా మందులను ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల ద్వారా అందే విధంగా చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ క్యాన్సర్ పట్ల గ్రామాలలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాలలో ఇప్పటివరకు ఎంతమందికి బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారని, మిగతా వారికి కూడా పరీక్షలను పూర్తి చేయాలన్నారు. బిపి, షుగర్ భారీన పడిన వారి వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. బీపీ, షుగర్ లకు దీర్ఘకాలంగా మందులు వాడాల్సి వస్తుంటుంది కాబట్టి ప్రభుత్వం అందిస్తున్న మందులను వారికి ఏఎన్ఎంలు, ఆశాలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, స్థానిక తహసిల్దార్ జగత్ సింగ్, ఇతర అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
బుధవారం, 05.02.2025 హైదరాబాద్


# cinema updates






## అజిత్ 'పట్టుదల'..

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ కాంపౌండ్ నుంచి వస్తున్న లేటెస్ట్ మూవీ పట్టుదల (తమిళ టైటిల్- విదామయుర్చి). సీనియర్ బ్యూటీ త్రిష హీరోయిన్ గా నటించగా మాగిజ్ తిరుమేని దర్శకత్వం వహించారు. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ పై భారీ బడ్జెట్ తో సుభాస్కరన్ నిర్మించారు. ఇప్పటికే మూవీ షూటింగ్ కంప్లీట్ అవ్వగా.. పొంగల్ కు విడుదల కావాల్సింది. కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. స్టైలిష్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రూపొందిన పట్టుదల మూవీ.. ఫిబ్రవరి 6వ తేదీన రిలీజ్ చేస్తున్నట్లు కొద్ది రోజుల క్రితం మేకర్స్ అనౌన్స్ చేశారు. అప్పుడే ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. సినిమాపై హైప్ క్రియేట్ చేసేందుకు ట్రై చేస్తున్నారు. వరుస పోస్టర్లను రిలీజ్ చేస్తున్నారు. సెన్సార్ బోర్డు అధికారులు యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చినట్లు తెలుపుతూ రీసెంట్ గా మేకర్స్ పోస్ట్ చేశారు. అయితే సినిమాను తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్స్, సీడెడ్ లో శ్రీలక్ష్మి మూవీస్ రిలీజ్ చేస్తున్నాయి. అదే సమయంలో మేకర్స్.. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్, టీజర్, సాంగ్స్, ప్రమోషనల్ కంటెంట్ ను రిలీజ్ చేయగా.. రెస్పాన్స్ తెలుగులో పెద్దగా రావడం లేదని చెప్పాలి. సినిమా రిలీజ్ డేట్ దగ్గర పడుతున్నా ఆడియన్స్ లో అంచనాలు క్రియేట్ కావడం లేదని తెలుస్తోంది. ఒకానొక టైమ్ లో టాలీవుడ్ లో కూడా అజిత్ కు మంచి మార్కెట్ ఉన్న విషయం తెలిసిందే. ఆయన నటించిన వివిధ సినిమాలు.. తెలుగులో రిలీజ్ అయ్యి సూపర్ హిట్స్ గా నిలిచాయి. ఆ తర్వాత మాత్రం మార్కెట్ తగ్గిపోయిందనే చెప్పాలి. ఇప్పుడు అజిత్.. పట్టుదల మూవీ పట్ల కనీస స్థాయిలో బజ్ క్రియేట్ అయినట్లు కనపడడం లేదు.

## హరిహర వీరమల్లు నిర్మాత ఫుల్ కాన్ఫిడెన్స్...



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న హరి హర వీరమల్లు సినిమాపై అంచనాలు రోజురోజుకు మరింత పెరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఆయన గతంలో పవన్ కళ్యాణ్‌తో చేసిన ఖుషి, బంగారం సినిమాలు ఘన విజయాలను సాధించాయి. ఇప్పుడు మూడోసారి వీరి కలయిక లో రాబోతున్న హరి హర వీరమల్లు పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న మరో భారీ బడ్జెట్ చిత్రం.ఈ సినిమా ద్వారా పవన్ కళ్యాణ్ చారిత్రక యోధుడిగా కనిపించనుండటం తో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఎ.ఎం. రత్నం తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు అందుకున్నారు. నిర్మాతగా మాత్రమే కాకుండా, రచయితగా, గీత రచయితగా, డిస్ట్రిబ్యూటర్‌గా కూడా తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. కర్తవ్యం అనే సినిమాతో తన నిర్మాత ప్రయాణాన్ని ప్రారంభించారు. తర్వాత ఇండియన్, ఖుషి, బాయ్స్, గిల్లి, 7/G బృందావన కాలనీ లాంటి సూపర్ హిట్ చిత్రాలను నిర్మించారు.ఇండియన్ సినిమా ద్వారా దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఎ.ఎం. రత్నం, శంకర్, ఏఆర్ రెహమాన్ వంటి దిగ్గజాలతో కలిసి మెగా బడ్జెట్ చిత్రాలు తెరకెక్కించారు. ఇటీవల, హరి హర వీరమల్లు సినిమాకు సంబంధించి కొత్త అప్‌డేట్ వచ్చింది. పవన్ కళ్యాణ్ నటిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన తాజా ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. ఇందులో పవన్ కళ్యాణ్ పురాతన యోధుడి లుక్‌లో కనిపిస్తూ, తన పవర్, గంభీరతను ప్రదర్శించబోతున్నట్లు స్పష్టమవుతోంది. అభిమానులు ఈ లుక్‌ను తెగ మెచ్చుకుంటున్నారు. ఇక నిర్మాత ఎ.ఎం. రత్నం తన పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ప్రభావం చూపించి, భారీ విజయాన్ని సాధిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ సినిమా సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలతో రూపొందుతోంది. భారీ సెట్లను నిర్మించి, విభిన్న యుద్ధ ఘట్టాలను చక్కగా రూపొందిస్తున్నారు.

## ఆ ఛాన్స్ లేదు..!



గీతా ఆర్ట్స్ 2 బ్యానర్ లో బన్నీ వాసు నిర్మాతగా సినిమాలు చేస్తున్నాడని తెలిసిందే. గీతా ఆర్ట్స్ అన్నది అల్లు అరవింద్ స్థాపించిన బ్యానర్.. ఆ బ్యానర్ నుంచి అల్లు అరవింద్ ఎన్నో సూపర్ హిట్ సినిమాలు చేశారు. ఐతే గీతా ఆర్ట్స్ 2 బ్యానర్ లో మీడియం రేంజ్, లో బడ్జెట్ సినిమాలు చేస్తూ వచ్చారు. ఐతే బన్నీ ఫ్రెండ్ అయిన వాసు అల్లు అర్జున్ తో పాటుగా గీతా ఆర్ట్స్ లో కూడా భాగం అవుతూ వచ్చాడు. అల్లు అరవింద్ కి బన్నీ వాసు మీద గురి ఉంటుంది. అందుకే గీతా ఆర్ట్స్ బ్యానర్ ని ఆయన చేతిలో పెట్టారు. ఇదిలా ఉంటే ఈ మధ్య బన్నీ వాసు గీతా ఆర్ట్స్ నుంచి బయటకు వచ్చేస్తారనే టాక్ స్ప్రెడ్ అయ్యింది. దీనిపై బన్నీ వాసు స్పందించారు. గీతా ఆర్ట్స్ 2 లో తెరకెక్కించే సినిమాల విషయంలో ఫైనల్ డెసిషన్ అల్లు అరవింద్ గారిదే అని.. ఐతే కొన్ని కథల విషయంలో తనకు అల్లు అరవింద్ గారికి కూడా వేరు వేరు అభిప్రాయాలు ఉంటాయని ఐతే ఈ మధ్యనే అలాంటి కథల గురించి ఒక నిర్ణయానికి వచ్చామని అన్నారు బన్నీ వాసు. అల్లు అరవింద్ గారి ఒపీనియన్ ఎలా ఉన్నా తనకు నచ్చిన కథలను గీతా ఆర్ట్స్ 2 లోనే నిర్మించే అవకాశం కూడా తనకు ఇచ్చారని బన్నీ వాసు వెల్లడించారు. ఇక మీదట తనకు బాగా నచ్చిన కథలను కంపల్సరీగా తెరకెకించే తీరుతా అంటున్నారు బన్నీ వాసు. ప్రస్తుతం బన్నీ వాసు తండేల్ సినిమాతో వస్తున్నారు. నాగ చైతన్య, సాయి పల్లవి జతకట్టిన ఈ సినిమా విషయంలో అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి.

## శ్రియ స్పెషల్ సాంగ్

స్టార్ హీరోల సినిమాల్లో భారీ సినిమాల్లో ఈ మధ్య స్పెషల్ సాంగ్స్ ఎక్కువైపోయాయి. స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్ ఉందంటే ఆ సాంగ్ ఎవరు చేస్తున్నారా? ఆ పాట ఎలా ఉండబోతుందనే ఆసక్తి ముందునుంచే అందరిలో ఉంటుంది. స్టార్ హీరోల సినిమాలన్నీ పాన్ ఇండియా లెవెల్లో రిలీజవుతున్న నేపథ్యంలో అగ్ర హీరోయిన్లు సైతం ఈ స్పెషల్ సాంగ్స్ చేయడానికి వెనుకడుగేయట్లేదు.అలాంటి స్పెషల్ ఆఫర్లు వచ్చినప్పుడు చేయడం వల్ల భారీ రెమ్యూనరేషన్ తో పాటూ, నేషనల్ లెవెల్లో తమకు క్రేజ్ పెరగడం ఖాయం. ఈ నేపథ్యంలో కోలీవుడ్ స్టార్ హీరో సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో చేస్తున్న రెట్రో సినిమాలో ఓ ఐటెం సాంగ్ ఉన్నట్టు తెలుస్తోంది. పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటున్న ఈ యాక్షన్ ఎంటర్టైనర్ కు సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ సినిమాలో ఆ స్పెషల్ సాంగ్ ను శ్రియా శరణ్ చేస్తున్నట్టు సమాచారం. రెట్రో స్పెషల్ సాంగ్‌లో సూర్యతో కలిసి శ్రియ కాలు కదిపినట్టు తెలుస్తోంది. ఈ స్పెషల్ సాంగ్‌ను వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేయనున్నట్టు సమాచారం. టాలీవుడ్ లో తన సినీ కెరీర్ ను మొదలుపెట్టిన శ్రియ ఆ తర్వాత తమిళ సినిమాల్లో కూడా నటించి కోలీవుడ్ లో కూడా స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగింది. స్టార్ హీరోల సరసన నటించి అందరి మనసులు గెలుచుకున్న శ్రియ విదేశీ వ్యాపారవేత్తను పెళ్లి చేసుకుని కొంత కాలం పాటూ సినిమాలకు దూరమైంది. తర్వాత మళ్లీ ఆర్ఆర్ఆర్ లో కనిపించిన శ్రియ తమిళ సినిమాలో కనిపించి చాలా కాలమే అవుతోంది. ఏడేళ్ల తర్వాత మళ్లీ తమిళ సినిమాలో చేయడం ఎంతో సంతోషంగా ఉందని శ్రియ ఈ సందర్భంగా తెలిపింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.